www.nagaranijam.com

PRGI/RNI NO : APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com

అక్షరనిజం నగరనిజం

తెలుగు దిన పత్రిక




సంపుటి : 14 | సంచిక : 147 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 18,మంగళవారం,ఆగస్టు,2026 | పేజీలు : 8+ | ₹ 3

Volume : 14 | Issue : 147 | Rangareddy | Editor : Aela.Purushotham | 18,Tuesday,August,2026 | Pages : 8+ | Price : 3/-

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# అత్యాధునిక వైద్య సేవలకు

## చెన్నారెడ్డి వైద్య విజ్ఞాన సంస్థ సిద్ధం





హైదరాబాద్, ఆగస్టు 17, (నగర నిజం) : సనత్‌నగర్‌లో నిర్మించిన అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను మంత్రులతో కలిసి పరిశీలించారు.కార్డియో, మూత్రపిండాలు, అవయవ మార్పిడి వైద్య విభాగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్లు, శస్త్రచికిత్స అనంతర వార్డు, అత్యవసర గాయాల చికిత్స విభాగం, అత్యవసర చికిత్సా విభాగం తదితరాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగుల నమోదు ప్రక్రియ, స్వాగత కేంద్రంలో టోకెన్ పంపిణీ యంత్రం పనితీరు, బాహ్య రోగుల కౌంటర్ సేవలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించి వాటి వినియోగం, పనితీరుపై అధికారులను ప్రశ్నించారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వర వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆసుపత్రి కార్యకలాపాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా

## మండల స్థాయి ప్రజావాణి

హైదరాబాద్, ఆగస్టు 17, (నగర నిజం) : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజావాణి నిర్వహించారు. రాష్ట్రంలోని 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రజావాణి రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ జీ. చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు.మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు అందాయి. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి పరిష్కారం కోసం వినతులు సమర్పించారు. ప్రతి వినతిని అధికారులు స్వీకరించి సమస్య స్వభావాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజల సౌకర్యార్థం శాఖల వారీగా ప్రత్యేక డెస్క్‌లు, సహాయ కేంద్రాలు, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించడంతో పాటు సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు.రాష్ట్రవ్యాప్తంగా ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 704 వినతులు స్వీకరించారు. ఒక్కో మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ ముందంజలో నిలిచింది. ఆ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 47 వినతులు వచ్చాయి.మండల స్థాయిలోనే ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను ప్రజలకు మరింత చేరువ చేయడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. జిల్లా లేదా రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సంబంధిత అధికారులకు సమస్యలను వివరించే అవకాశం ప్రజావాణి ద్వారా కలిగిందన్నారు.ప్రజల నుంచి అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు, అధికారుల నుంచి మండల స్థాయి ప్రజావాణికి విశేష స్పందన లభించిందన్నారు.

# జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీతో

## 2 లక్షల మందికి ఉపాధి

హైదరాబాద్, ఆగస్టు 17, (నగర నిజం) : జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు.సోమవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ నిర్వహించిన జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ వీడియో సమావేశంలో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల శాఖ మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీలో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు తెలిపారు. స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతం ఉంటుందని, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తోందని వివరించారు.ఇప్పటికే ప్రత్యేక ప్రయోజన సంస్థకు అభివృద్ధి ప్రణాళికను అందజేశామని చెప్పారు. ఇంజినీరింగ్, కొనుగోలు, నిర్మాణ పద్ధతిలో కొనసాగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. నీటి సరఫరా పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, విద్యుత్ సరఫరా పనులను సైతం గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు.భారత్ పారిశ్రామిక అభివృద్ధి యోజన కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 సిద్ధంగా ఉన్న పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌ను శ్రీధర్ బాబు కోరారు.ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# గోవిందరావుపేటలో తొలి

## మండల స్థాయి ప్రజావాణి



గోవిందరావుపేట, ఆగస్టు 17, (నగర నిజం) : ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం గోవిందరావుపేటలో తొలిసారిగా జరిగింది. కార్యక్రమానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రజలు సాధారణ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే వీలైనంత వరకు సమస్యలను పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి వినతిని క్రమబద్ధంగా స్వీకరించి, సమస్యను పరిశీలించి దరఖాస్తుదారుడికి స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సూచించారు.మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలను సంబంధిత అధికారులకు పంపించి, తీసుకున్న చర్యల వివరాలను దరఖాస్తుదారుడికి తెలియజేయాలని చెప్పారు. ప్రతి దరఖాస్తుదారుడి ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని ఆదేశించారు.సమస్య పరిష్కారానికి పట్టే సమయాన్ని దరఖాస్తుదారుడికి ముందుగానే తెలియజేయాలని మంత్రి సూచించారు. నిర్ణీత సమయంలో సమస్య పరిష్కారమైతే ఆ విషయాన్ని, ఆలస్యమైతే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. అత్యవసర సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని, జిల్లా లేదా రాష్ట్ర స్థాయి జోక్యం అవసరమైన సమస్యలకు వారం రోజుల్లోగా పురోగతి వివరాలను దరఖాస్తుదారులకు అందించాలని ఆదేశించారు.ఒకే సమస్య కోసం ప్రజలు పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సీతక్క సూచించారు.ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ల కోసం దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అన్ని గ్రామాల నుంచి స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హత కలిగిన వర్గాలకు దశలవారీగా పింఛన్లను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ అవగాహన లేకపోవడం లేదా దరఖాస్తు సమర్పించకపోవడం వల్ల పింఛన్‌కు దూరం కాకుండా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, లోతట్టు ప్రాంతాలు, గిరిజన ఆవాసాలు, తండాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని మంత్రి ఆదేశించారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గిరిజన తండాలు, గిరిజన ఆవాసాల్లో సుమారు రూ.50 కోట్ల విలువైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రతిపాదించినట్లు చెప్పారు.గ్రామాల్లో అంతర్గత రహదారులు, సీసీ రహదారులకు సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సీతక్క తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, తహసీల్దార్ సృజన్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరుణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో

## ముసాయిదా ఓటరు

## జాబితా విడుదల

రంగారెడ్డి, ఆగస్టు 17, (నగర నిజం) : రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను ఈ నెల 17న విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి తెలిపారు. ముసాయిదా జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను ప్రతి అర్హత కలిగిన ఓటరు పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా, మార్పులు లేదా సవరణలు అవసరమైనా సెప్టెంబర్ 16, 2026లోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గడువులోగా అందిన అభ్యర్థనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందిస్తామని పేర్కొన్నారు.

**జిల్లాలో 24,12,652 మంది ఓటర్లు**

ఆగస్టు 17, 2026 నాటికి జిల్లాలోని సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం మొత్తం 24,12,652 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,12,381 మంది పురుషులు, 12,00,062 మంది మహిళలు, 209 మంది తృతీయ లింగ ఓటర్లు ఉన్నారు.నియోజకవర్గాల వారీగా ఇబ్రహీంపట్నంలో 2,59,317 మంది, ఎల్.బి.నగర్‌లో 3,37,919 మంది, మహేశ్వరంలో 3,39,306 మంది, రాజేంద్రనగర్‌లో 3,88,278 మంది, శేరిలింగంపల్లిలో 4,43,544 మంది, చేవెళ్లలో 2,18,274 మంది, కల్వకుర్తిలో 2,16,890 మంది, షాద్‌నగర్‌లో 2,09,124 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 4,43,544 మంది ఓటర్లు ఉండగా, ఆ తరువాత రాజేంద్రనగర్‌లో 3,88,278 మంది, మహేశ్వరంలో 3,39,306 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు అనర్హుల పేర్లు లేకుండా పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టినట్లు సి. నారాయణ రెడ్డి తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ ముసాయిదా జాబితాలో పేరు లేని వారు, వివరాల్లో మార్పులు లేదా సవరణలు కోరుకునే వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.

WANTED LECTURERS

Acharya Jayashankar Degree College (6076)

Narayankhed, Sangareddy, Telangana.

SUBJECTS

Maths • Physics • Computers • Commerce • Chemistry
Botony • Zoology • English • Telugu • Hindi
History • Economics • Political Science

INTERVIEW DATE: 20/08/2026

CONTACT: 8309981865, 9949866093, 9000619321

# ప్రశ్నార్థకంగా మారిన నిరుద్యోగుల జీవితాలు ?





- ఢీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్
- నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడోద్దు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య
- ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి జగన్
- ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిరాహార దీక్ష

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (నగరనిజం) :** నిరుద్యోగుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని ఢీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఢీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ... కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో లక్షలాది మంది ఉన్నత విద్యను అభ్యసించిన వారికి నిరుద్యోగ కోరల్లో చిక్కిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్న నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైందన్నారు. 2014లో మోడీ సర్కార్ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 12 ఏండ్లు గడుతున్నప్పటికీ ఉద్యోగాలు కల్పించకుండా యువతను మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఐటి రంగంలో వేల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చలేదన్నారు. మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయడమే తప్ప కొత్త రిక్రూట్మెంట్ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు కనిపిస్తామని అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు గడుస్తున్నా 62 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందన్నారు. 20 వేల కానిస్టేబుల్ పోస్టులకు ఖాళీలు ఉంటే 7 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందులో రంగారెడ్డి జిల్లాకు ఏ ఒక్క పోస్టు కూడ కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం అన్ని ప్రభుత్వ శాఖలో సుమారు 9 వేల మంది పదవి విరమణ పొందుతున్నారని తెలిపారు. తెలంగాణలో 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటూ ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 11వేల కోట్ల స్కాలర్ షిప్ లను విడుదల చేయాలన్నారు. ఈ నెల 20న నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) పార్టీ నిర్వహించే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, కందుకూరి జగన్, జిల్లా కమిటీ సభ్యులు చాతళ్ల జంగయ్య, అంజయ్య, బుగ్గరాములు, రావుల జంగయ్య, కిషన్, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ, నాయకులు విజయమ్మ, ఇందిరా, స్వప్న, ఆనంద్, శంకర్, నర్సింహ, చందునాయక్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జంగయ్య, గజ్జల మహేష్, లింగం, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, తరంగ్, శ్రీకాంత్, మణి, బన్నీ, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 113 వినతీలు





- ప్రజావాణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 నగర నిజం :** ప్రజావాణి కి 113 వినతీలు వచ్చాయని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ప్రజావాణిలో ప్రజల సమస్యలపై ప్రజా ఫిర్యాదు లు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలు లో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు మరియు సమస్యలకు సంబంధించిన 113 దరఖాస్తులను స్వీకరించారు. పెన్షన్, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, , సంబంధిత శాఖలకు సంబంధించి దరకాస్తు లను స్వీకరించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని ,ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని, శాఖ ల వారిగా పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.ఈరోజు నుండి ప్రతి మండలం లో ఏం పి డి ఓ కార్యాలయంలో ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని, మండలాల లో ఉండే ప్రజలు ప్రతి సోమవారం మండలాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని' మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.మొక్కలు నాటే కార్యక్రమం లో బాగంగా జిల్లాకు ఉన్న లక్ష్యం మేరకు సంబంధిత అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్,జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, డి ఆర్ డి ఓ శ్రీనివాస్,జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు



# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ నాయకులు





- ప్రజల్లో ఉన్న నాయకుడిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు: తుంగతుర్తి రవి

**మేడిపల్లి :ఆగస్టు 17(నగర నిజం ):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వజ్రెష్ యాదవ్ గారిపై మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలను ఈరోజు పీర్జాదిగూడ లోని బండి కన్వెన్షన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో హాజరైన డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జలెందర్ రెడ్డి,పోచారం డివిజన్ అధ్యక్షులు కర్రె రాజేష్,మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి శ్రీరాములు,దర్గా దయాకర్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.తుంగతుర్తి రవి మాట్లాడుతూ, వజ్రెష్ యాదవ్ ఒకసారి ఉప సర్పంచ్గా, ఒకసారి సర్పంచ్గా ప్రజలకు సేవ చేసిన వ్యక్తి అని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎన్నికల్లో ఓడిపోయినా, నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుడు వజ్రెష్ యాదవ్ గారు అని తెలిపారు.ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలిచిన వారు తమ బిఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తులేనని, ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుల గురించి పూర్తి సమాచారం తెలుసుకోకుండా బయట నుంచి వచ్చి ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ఐపీఎస్ అధికారిగా పనిచేసిన వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా భూకబ్జాల ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, ఆరోపణలు నిజమైతే ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని తుంగతుర్తి రవి డిమాండ్ చేశారు.ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పోరాడే నాయ కుడి గురించి తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం కాదు.. ముందుగా వాస్తవాలు తెలుసుకోవాలి. ఆధారాలు ఉంటే చూపిం చాలి, లేకపోతే నిరాధార ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి అని తుంగతుర్తి రవి అన్నారు.రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం మాత్రం సరికాదని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో రంజిత్ కుమార్ రెడ్డి,ముది గొండ రమేష్, బలరాం,యాసారం నాగేష్,మోహన్ కుమార్, సుదర్శన్ రెడ్డి,మహ్మద్ మజర్,బర్ల నాగరాజు,మణిరం నాయక్, ,జయందర్,రాజ రాజు,మహేష్ గౌడ్,సోమయ్య,శ్రీను నాయక్, సాయిరాం గౌడ్, బొల్లురి నాగరాజు,శరత్ గౌడ్, కపిల్,nnk దుర్గ, తండా పరమేశ్వరి, శ్రీలతతదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే కొనసాగించాలి



**వీపనగండ్ల.ఆగస్టు17.(నగర నిజం):**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్త నిరసనకూ మద్దతుగా వీపనగండ్ల మండల కేంద్రం లో. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు.బిఆర్ఎస్. పార్టీ నాయకులు తెలిపారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం తల్లిదండ్రులకు పెద్ద ఆర్థిక భారంగా మారుతున్న పరిస్థితుల్లో, వివాహ సమయంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఈ పథకాలను పేద కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు అమలు చేసింది.పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న పథకాలను రద్దు చేయడం లేదా నిలిపివేయడం పేద కుటుంబాలపై మరింత ఆర్థిక భారాన్ని మోపినట్లే అవుతుంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్లో ఉన్న ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాల భవిష్యత్తుపై ఏర్పడిన న్యాయపరమైన పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం పేదలకు స్పష్టత ఇవ్వాలని, పథకాల ప్రయోజనాలు అర్హులైన కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. బిఆర్ఎస్ ప్రధాన డిమాండ్లు.కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు.షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలి.పెండింగ్లో ఉన్న అర్హులైన దరఖాస్తులకు వెంటనే ఆర్థిక సహాయం విడుదల చేయాలి.పథకాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి.పేదల సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాలి. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన సహాయం సకాలంలో అందించాలి.బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ వేణు మాధవ రెడ్డి,జొల్లు నారాయణ,ముంత శివ,గడల లక్ష్మణ్,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# వీపనగండ్ల మండల కేంద్ర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



**వీపనగండ్ల.ఆగస్టు17(నగర నిజం):**మండలంలో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని వీపనగండ్ల గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.మండల ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కోర్టు ఏర్పాటు, డిగ్రీ కళాశాల ఏర్పాటు, గోవర్ధనగిరి నుంచి బొల్లారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, సర్కిల్/సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల నియామకం, వ్యవసాయ శాఖకు సంబంధించిన పోస్టుల భర్తీ వంటి పెండింగ్ అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.అదేవిధంగా అమ్మపల్లి నుంచి కేతేపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, పంట రుణమాఫీ అందని అర్హులైన రైతులకు రుణమాఫీ చేయడం, సింగోటం రిజర్వాయర్ నుంచి గోపాల్నిన్నె వరకు కాలువ పనులను పూర్తి చేయడం వంటి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి పూర్తిస్థాయి పురోహితుడిని నియమించి ఆలయ నిర్వహణను మరింత మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు.వీపనగండ్ల మండల అభివృద్ధికి సంబంధించిన ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్లో ప్రజలతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బిఆర్ ఎస్ మండల సీనియర్ నాయకులు కర్ణాకర్ రెడ్డి,వంగూరు నారాయణ రెడ్డి,జొల్లు.నారాయణ,సంగనమోని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కే.ఎం. పాండు 81వ జయంతి వేడుకలు ఘనంగా ఎమ్మెల్యే కే.పీ. వివేకానందతో కలిసి పాల్గొన్న ఉద్యమకారుడు, టీఆర్ఎస్ నాయకుడు జాలిగం రాకేష్



**కుత్బుల్లాపూర్ । ఆగస్టు 17 । నగర నిజం ప్రతినిధి:** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద తండ్రి, మాజీ మున్సిపల్ చైర్మన్ కీ.శే. కే.ఎం. పాండు 81వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కే.ఎం. పాండు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కే.పీ. వివేకానందతో కలిసి ఉద్యమకారుడు, టీఆర్ఎస్ నాయకుడు జాలిగం రాకేష్ పాల్గొని కే.ఎం. పాండు సేవలను స్మరించుకున్నారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలు, కుత్బుల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని నాయకులు పేర్కొన్నారు.కే.ఎం. పాండు జయంతి సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని పలువురు నాయకులు గుర్తుచేసుకున్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగాయి.

నగరనిజం

18 మంగళవారం, ఆగస్టు 2026

# నూతన్‌కల్‌లో నాగులమ్మకు నీడగా..

# వందల ఏళ్ల మహావృక్షం!

### తరాలు మారినా.. సాక్షిగా మహావృక్షం

నాగులమ్మ తల్లి విగ్రహానికి నీడనిస్తూ విస్తరించిన మహా మర్రివృక్షం, పక్కనే నిశ్శబ్ధంగా ఉన్న భైరవుని కుంట, అందులో ఉందని చెబుతున్న పురాతన భైరవుని విగ్రహం.. ఇవన్నీ నూతన్‌కల్ గ్రామ గతానికి మౌన సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.
కాలం ఎంత మారినా.. తరాలు ఎన్ని మారినా.. నాగులమ్మకు నీడగా నిలిచిన ఈ మహావృక్షం మాత్రం తన ఊడలను నేలలోకి దించి మరింత విస్తరిస్తూ, నూతన్‌కల్ చరిత్రను తనలో దాచుకున్న జీవంతమైన గుర్తుగా నిలుస్తోంది.

- పక్కనే భైరవుని కుంట.. కొలనులో పురాతన

## భైరవుని విగ్రహం ఉందంటున్న గ్రామస్తులు

**మేడ్చల్ ఆగస్టు 17(నగరనిజం):** తరాలు మారుతున్నా.. రూపురేఖలు మారుతున్నా.. గ్రామ చరిత్రకు కొన్ని ఆనవాళ్లు మాత్రం నేటికీ సజీవ సాక్ష్యాలుగా నిలుస్తుంటాయి. ఎల్లంపేట్ మున్సిపల్ నూతన్‌కల్‌లోని నాగులమ్మ తల్లి విగ్రహం, దాని చుట్టూ విస్తరించిన మహా మర్రివృక్షం, పక్కనే ఉన్న భైరవుని కుంట, ఆ కుంటలోనే పురాతన భైరవుని విగ్రహం ఉందని గ్రామస్తులు చెబుతున్న విషయం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

### నాగులమ్మకు నీడగా మహావృక్షం

నాగులమ్మ తల్లి విగ్రహం ఉన్న ప్రదేశంలో ఉన్న మర్రిచెట్టు సాధారణ వృక్షాలకు భిన్నంగా విశాలంగా విస్తరించి ఉంది. భారీ కొమ్మలు, నేలను తాకి తిరిగి కాండాలుగా మారిన అనేక ఊడలు, మందమైన కాండాలతో ఈ వృక్షం ఒక చిన్న వనంలా కనిపిస్తోంది. చెట్టు విస్తరించిన తీరు చూస్తే దాని మొత్తం పరిమాణాన్ని ఒకే కొలతతో అంచనా వేయడం కష్టంగా ఉంది.

### "మా చిన్నప్పటి నుంచే ఇంత పెద్దగా ఉంది"

ఈ మహావృక్షం వయస్సుపై గ్రామ పెద్దల్లో ఆసక్తికరమైన మాటలు వినిపిస్తున్నాయి. కొంతమంది పెద్దలు ఈ వృక్షం సుమారు 200 సంవత్సరాలకు పైబడినదై ఉండవచ్చని చెబుతున్నారు. మరోవైపు 80–90 ఏళ్ల వయస్సున్న గ్రామ పెద్దలు కూడా తాము చిన్ననాటి నుంచి చూస్తున్నప్పటి నుంచే ఈ చెట్టు మహావృక్షంగానే ఉందని చెబుతున్నారు. అయితే వృక్షం ఖచ్చితమైన వయస్సును నిర్ధారించే శాస్త్రీయ ఆధారాలు ప్రస్తుతం లేవు. అందువల్ల 200 ఏళ్లకు పైబడినదనే విషయం స్థానికుల మౌఖిక చరిత్ర, నమ్మకాల ఆధారంగానే ఉంది.

### నాగుల చవితి సందర్భంగా ఘనంగా పూజలు

మహావృక్షం కింద నాగులమ్మ తల్లి విగ్రహం ఉంది. సాధారణ రోజుల్లో ఇక్కడ పెద్దగా పూజా కార్యక్రమాలు జరగవు. అయితే నాగుల చవితి సందర్భంగా మాత్రం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ రోజు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాగులమ్మను దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు.

### పక్కనే భైరవుని కుంట

నాగులమ్మ మహావృక్షానికి సమీపంలోనే భైరవుని కుంట లేదా భైరవుని కొలను ఉంది. ఈ కుంటకు కూడా పురాతన నేపథ్యం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. మరింత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ కొలనులోనే మరో పురాతన భైరవుని విగ్రహం ఉందని స్థానికులు చెబుతుండటం.



వందల సంవత్సరాలు చరిత్ర కలిగినటువంటి నాగులమ్మ విగ్రహం

ఆ విగ్రహం ఎప్పటిది? ఎవరు ప్రతిష్ఠించారు? అది మొదటి నుంచే అక్కడ ఉందా? అనే విషయాలపై స్పష్టమైన చారిత్రక ఆధారాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. అయితే పాత తరాల నుంచి ఈ విగ్రహం గురించి వింటూ వస్తున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

### ఒకే ప్రాంతంలో.. ఎన్నో ప్రశ్నలు

నాగులమ్మ విగ్రహం.. దానికి ఆశ్రయంగా నిలిచిన మహా మర్రివృక్షం.. పక్కనే భైరవుని కుంట.. కొలనులో ఉందని చెబుతున్న పురాతన భైరవుని విగ్రహం.. ఇవన్నీ ఒకే ప్రాంతంలో ఉండటం ఆసక్తిని కలిగిస్తోంది. ఈ ప్రాంతానికి గతంలో ఏదైనా ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉండేదా? నాగులమ్మ, భైరవుని విగ్రహాలకు పరస్పర సంబంధం ఉందా? భైరవుని కుంటకు ఆ పేరు ఎలా వచ్చింది? వంటి ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది.

### వెలుగులోకి రావాల్సిన చరిత్ర

గ్రామ పెద్దల జ్ఞాపకాలు, తరతరాలుగా వస్తున్న స్థానిక కథనాలతో పాటు పురాతన రికార్డులు, శాసనాలు, భౌగోళిక ఆధారాలను పరిశీలిస్తే ఈ ప్రాంత చరిత్రపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే వృక్ష నిపుణులతో మహావృక్షాన్ని పరిశీలించి దాని వయస్సుపై శాస్త్రీయ అంచనా వేయడం, భైరవుని విగ్రహాన్ని నిపుణులు పరిశీలించడం అవసరమని స్థానికులు భావిస్తున్నారు.





భైరవని కుంట లో ఉన్న భైరవని విగ్రహం

### మౌనంగా నిలిచిన మహావృక్షం..

### చరిత్రను వెతుకుతున్న తరాలు

నాగులమ్మ ఎవరి జ్ఞాపకం? భైరవుని కుంట ఎవరి ఆనవాలు?
వందల ఏళ్ల నాటిదని గ్రామ పెద్దలు చెబుతున్న మహా మర్రివృక్షం.. దాని నీడలో నాగులమ్మ విగ్రహం.. పక్కనే భైరవుని కుంట.. కొలనులో పురాతన భైరవుని విగ్రహం ఉందని స్థానికుల చెబుతున్న మాటలు.. ఇవన్నీ యాదృచ్ఛికమా? లేక నూతన్‌కల్ గతంలో మరుగునపడిన ఏదైనా ఆధ్యాత్మిక చరిత్రకు ఇవే ఆనవాళ్లా? సమాధానం చెప్పాల్సింది కాలమే.. కానీ ఆ చరిత్రను వెలికితీయాల్సిన బాధ్యత మాత్రం నేటి తరానిదే!
"చెట్టు వయస్సు ఎంత?" కంటే.. "ఇన్ని తరాలుగా ఇది ఎందుకు ఇక్కడే ఉంది?" అనేదే అసలు ప్రశ్న!



నాగుల పంచమి సందర్భంగా అమ్మవారికి భక్తులు పూజలు చేస్తున్న దృశ్యం



నాగులమ్మకు నీడగా ఉన్న మహావృక్షం దృశ్యం

## భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుభాషా కవిసమ్మేళనం.



**హైద్రాబాద్ ఆగస్ట్ 17;** శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో బహుభాషా కవిసమ్మేళనం,మానవతావాది శ్రీ ఉమ్మడిసింగు హనుమంతరావు స్మారక సాహితీ పురస్కారం ప్రదానోత్సవం గానసభ కళావేదికలో ఘనంగా నిర్వహించారు.కవి సమ్మేళనం లో జై.వి.కుమార్, డా. నిక్షలబొల్లిముంత వెంకట రమణ,బి.రామకృష్ణ,మిద్దె సురేష్, కనకాచారి,విజయకుమార్,సుతారపు వెంకటనారాయ ,ప్రభాకరరావు, గుళ్ళపల్లి ఆంజనేయులు రాజయ్య, తధితరులు కవితా గానం చేశారు.

## పోషకాహార లోపం వల్లనే విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు



- ఆర్ బి ఎస్ కే హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును

### తనిఖీ చేసిన జిల్లా వైద్య అధికారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 నగర నిజం :** పోషకాహార లోపం వల్లే విద్యార్థులు అనేక సమస్యలకు గురవుతున్నారని జిల్లా వైద్య అధికారి సుధాకర్ లాల్ అన్నారు.సోమవారం నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే సుధాకర్ లాల్ రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఆర్.బి.ఎస్.కె మొబైల్ టీం ద్వారా పరిగి పట్టణంలోని హరిజన్ వాడలో గల మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులను స్వయంగా పరీక్షించారు.ఈ సందర్భంగా ఆర్ బి ఎస్ కే వైద్యులు, హెడ్మాస్టర్ మరియు విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులకు తరచుగా వచ్చే చిరు ఆరోగ్య సమస్యలు, పోషకాహార లోపాలు, దంత సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, నిత్యజీవితంలో ఆరోగ్యంగా ఉండడం కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.అంతేగాక స్వయంగా విద్యార్థులను పరీక్షించారు. రక్తహీనతతో బాధపడుతున్న కొంతమంది విద్యార్థులకు వెంటనే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్ ను అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, వైద్య సిబ్బంది మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు



### భర్త హత్య కేసును ఛేదించిన మేడిపల్లి పోలీసులు

**మేడిపల్లి :ఆగస్టు. 17(నగర నిజం ):**మేడిపల్లి పోలీసులు భర్త హత్యకు సంబంధించిన కేసును సమర్థవంతంగా ఛేదించి, హత్యకు పాల్పడిన నిందితురాలిని అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించనైనది. 06.08.2026న మృతుడు ( సత్యనారాయణ వయస్సు: 51 సంలు) నైట్ డ్యూటీ ముగించుకుని సుమారు 12:00 గంటలకు ఇంటికి వచ్చాడు. అదే సమయంలో నిందితురాలు ( సునీత భర్త పేరు సత్యనారయణ, వయస్సు: 44 సంలు, నివాసము: రాఘవేంద్ర కాలనీ, పీర్జాదిగూడ ) తన రోజువారీ పనికి వెళ్లి సుమారు 13:30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చింది. అనంతరం మృతుడు మద్యం సేవించడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ సమయంలో మృతుడు నిందితురాలిని దూషిస్తూ, ఆమె ను మానసికంగా వేధించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. భర్త ప్రవర్తనతో ఆగ్రహానికి గురైన నిందితురాలు అతడిని హత్య చేయాలని నిర్ణయించుకుంది. అదేరోజు తన పథకం ప్రకారం నిందితురాలు మృతుడి చేతులు, కాళ్లను చీరతో కట్టి, కర్రతో తలపై మరియు శరీరంలోని ఇతర భాగాలపై విచక్షణారహితంగా కొట్టింది. ఈ దాడిలో మృతుడికి తీవ్ర గాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు.అనంతరం నిందితురాలు మృతుడి కుమారుడైన ( నికిత్ కు ) ఫోన్ చేసి తన తండ్రి వాహనం నుండి ప్రమాదవశాత్తు జారిపడి గాయపడినట్లు తప్పుడు సమాచారం ఇచ్చింది. అనంతరం గాయపడిన వ్యక్తిని బోడుప్పల్‌లోని మెడిస్టార్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సుమారు 22:18 గంటలకు విధుల్లో ఉన్న వైద్యుడు మృతుడిని పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు.దర్యాప్తులో భాగంగా పోలీసులు, PME, Doctor opinion తీసుకొని, సంఘటనా స్థలాన్ని పరిశీలించి, CC Footages check Accident జరుగనందున, నిందితురాలిని విచారించగా, ఆమె తన భర్త, తనను తన పిల్లలను మానసికముగా వేదింపులకు గురిచేసి నందున, తన భర్త చేతులు, కాళ్ళు చిరతో కట్టి, ఒక సెంట్రింగ్ కర్ర తో తలపై మరియు శరీర భాగములపై కొట్టగా, అట్టి గాయాలకు

# గ్రేటర్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి





- కార్తీక్ రెడ్డి
- శంషాబాద్ 119 డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన కార్తీక్ రెడ్డి సమక్షంలో భారీగా గులాబీ గూటికి చేరికలు
- కొత్వాల్ గూడ నుండి గుంటి చరణ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులు

**రాజేంద్రనగర్, ఆగస్టు 17 (నగరనిజం ప్రతినిధి):** త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం లో గులాబీ జెండా ఎగరేయాలని ఆ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన యువకులు చాలామంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని కార్తీక్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ 119 డివిజన్ లోని కొత్వాల్ గూడ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆ పార్టీ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షుడు గుంటి చరణ్ ఆధ్వర్యంలో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. కొత్వాల్ గూడ గ్రామానికి చెందిన
ఏ చరణ్, నిఖిల్, నవీన్, అనిల్, బెనోని వరుణ్, అరుణ్, వరప్రసాద్, చంటి తదితరులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కార్తీక్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన కార్తీక్ రెడ్డి.... బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులకు అభినందనలు తెలిపారు.పార్టీలో చేరిన యువకులందరికి సముచిత స్థానం కల్పిస్తామని కార్తీక్ రెడ్డి భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇన్ని వర్గాల ప్రజలు విసుగెత్తిపోయారని అందువల్లనే చాలామంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్న పార్టీ కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుంటి చరణ్ ను కార్తీక్ రెడ్డి అభినందించారు. త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజల మద్దతుతో ఈసారి గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగరేస్తామని కార్తీక్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమిష్టిగా ఎదుర్కోవడానికి పార్టీ నేతలు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ 119 డివిజన్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిన్న గండు రాజేందర్, పార్టీ రెండు డివిజన్ల ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాచమల్ల జయసింహ, ఉపాధ్యక్షులు గుంటి చరణ్, పెదిరిపాటి మురళి గౌడ్, రాచమల్ల కార్తీక్, యూత్ అధ్యక్షుడు జీవీ పవిత్ర సాగర్, ఎస్సీ సెల్ అధ్యక్షు రాచమల్ల రమేష్, పార్టీ నేతలు ప్రవీణ్ గౌడ్, మోసిన్, గుంటి బాలు, చంద్రశేఖర్, అరవింద్ తదితర పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాలానగర్, చింతల్‌లో ఆర్ఎన్‌సీ ఆసుపత్రుల వైద్య సేవలు




**బాలానగర్,। ఆగస్టు 17 । (నగర నిజం ప్రతినిధి):**బాలానగర్, చింతల్ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆర్ఎన్‌సీ ఆసుపత్రులు ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. రిషిదీప్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆసుపత్రుల్లో సాధారణ వైద్య సేవలతో పాటు వివిధ అనారోగ్య సమస్యలకు నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.ఆసుపత్రి వైద్య సంచాలకురాలు, సాధారణ వైద్య నిపుణురాలు, మధుమేహ వైద్య నిపుణురాలు డాక్టర్ పి. యాస్మీన్ ఆధ్వర్యంలో సమగ్ర సాధారణ వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య పరీక్షలు, వ్యాధుల నిర్ధారణ–చికిత్స, మధుమేహ నియంత్రణ, రక్తపోటు మరియు గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ సమస్యలు, జీర్ణకోశం–కాలేయ సంబంధిత సమస్యలకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అదేవిధంగా ముందస్తు ఆరోగ్య సంరక్షణలో భాగంగా పోషకాహారం, టీకాలు, ఆరోగ్య పరిరక్షణపై అవసరమైన వైద్య సలహాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ, రోగి అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగత వైద్య సేవలు, నాణ్యమైన చికిత్సకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు.బాలానగర్ ఎక్స్‌రోడ్స్‌లో పిలర్ నంబర్ 21/22 వద్ద, అలాగే చింతల్‌లోని ద్వారకాపురి కాలనీలో ఆర్ఎన్‌సీ ఆసుపత్రుల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్య సేవలు, అపాయింట్‌మెంట్ల కోసం 62620 99995, 62620 99996 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

## బాల్‌రెడ్డి నగర్ అధ్యక్షుడు దుర్గారెడ్డికి ఎస్ఎల్ఎన్ గ్రూప్ 7వ వార్షికోత్సవ ఆహ్వానం



**బాల్‌రెడ్డి నగర్, । ఆగస్టు 17 । (నగర నిజం ప్రతినిధి):**ఎస్ఎల్ఎన్ గ్రూప్ 7వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమానికి బాల్ రెడ్డి నగర్ అధ్యక్షుడు దుర్గారెడ్డి అన్నను నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేసి, కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఎస్ఎల్ఎన్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఈసారి కూడా ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు, సభ్యులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాలిగం రాకేష్ పాల్గొని దుర్గారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. వార్షికోత్సవ వేడుకలు విజయవంతం కావాలని దుర్గారెడ్డి ఆకాంక్షించారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలి

### అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి శారదదేవి ఆదేశాలు



**రంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 17 (నగరనిజం) :** ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి శారద దేవి అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (136) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారదదేవికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శారదదేవి మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ--60, ఇతర శాఖలు -76, మొత్తం 136 దరఖాస్తులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వీపనగండ్ల.లో ప్రారంభమైన ప్రజావాణి



**వీపనగండ్ల.ఆగస్టు.17(నగర నిజం)** మండల కేంద్రంలో సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నోడల్ ఆఫీసర్ ఎంపీడీవో శ్రీనివాసరావు. తాసిల్దార్ ఖాజామైనుద్దీన్. ఎస్సై నరేష్ కుమార్ హాజరయ్యారు మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఈ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు ఈ ప్రజా వానికి మండలం నుండి 11 దరఖాస్తులు వచ్చాయని నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని గతంలో వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించేవారు జిల్లా కేంద్రానికి దరఖాస్తులు చేయడానికి ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అందుకనే సొంత మండల కేంద్రంలోని ఈ ప్రజావాణి నిర్వహిస్తున్నామని మండలం ప్రజలు ప్రతిదీ ఈ ప్రజావాణిలో దరఖాస్తులు చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు





## అందేరి ముంబై ప్రాంతంలో ఘనంగా జరిగిన బోనాల పండుగ

**మేడిపల్లి :ఆగస్టు 17(నగర నిజం ):** అంధేరి ప్రాంతంలో ని డోంగ్రిలోని గావ్ దేవి మాతకు బోనాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో కపస్వాడి, 10వ రోడ్ జుహు, జుహు గల్లీ నుండి బోనాలు రావడం జరిగింది తెలుగువాళ్ళు అంతాకలిసి ప్రతిసంవత్సరం బోనాల జాతర జరుగుతుంది ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున మహిళలు ఆర్రేంజ్ చేసుకున్నారు.





## సిపిఐ పార్టీ నుంచి తోటపల్లి శంకర్ తొలగింపు



**జవహర్‌నగర్, ఆగస్టు 17, నగర నిజం న్యూస్** భారత కమ్యూనిస్టు పార్టీ నిబంధనావళికి వ్యతిరేకంగా వ్యవహరించినందుకు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్న తోటపల్లి శంకర్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యవర్గం సమావేశమై శంకర్ వ్యవహారశైలిపై చర్చించి, పార్టీ నిబంధనావళికి విరుద్ధంగా వ్యవహరించినట్లు భావించిన నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు ఉమా మహేష్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గం తీర్మానం మేరకు తోటపల్లి శంకర్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు వెల్లడించారు.పార్టీ క్రమశిక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, పార్టీ నిబంధనలను ఉల్లంఘించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఉమా మహేష్ స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో పనిచేయడం ప్రతి పార్టీ సభ్యుడి బాధ్యత అన్నారు.ఇకపై తోటపల్లి శంకర్‌కు సిపిఐ పార్టీకి ఎలాంటి సంబంధం ఉండదని జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ స్పష్టం చేశారు. పార్టీ పేరు, పదవి లేదా పార్టీ కార్యక్రమాలతో శంకర్‌కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గం తీసుకున్న నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. పార్టీ నిర్ణయాలను పాటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ముందుకు సాగుతుందని ఉమా మహేష్ తెలిపారు.

## ఏజీ కాలనీలో రూ. కోటి 7 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**కుత్బుల్లాపూర్,। ఆగస్టు 17 । (నగర నిజం ప్రతినిధి):**ఏజీ కాలనీ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారులను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా రూ.కోటి 7 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా స్థానికంగా అవసరమైన రహదారి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో వర్షాకాలంలో ఏర్పడే రోడ్డు సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రహదారి పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభివృద్ధి పనులకు సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో వెంగళ్రావు డివిజన్ యాదవ సంఘం జనరేటర్ సెక్రెటరీ పశువుల నాగరాజు యాదవ్,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు, నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలి

- గురునానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్ సింగ్ కోహ్లీ
- ఘనంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (నగరనిజం) :** విద్యార్థులు విద్యతోపాటు, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని గురునానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ గగన్ సింగ్ కోహ్లీ సూచించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ యూనివర్సిటీ ప్రాంగణంలో నూతనంగా చేరిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల కోసం ఓరియంటేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులను గురునానక్ యూనివర్సిటీ కుటుంబంలోకి ఆహ్వానించడం, విశ్వవిద్యాలయ విద్యా వాతావరణం, నిబంధనలు, సౌకర్యాలు మరియు విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గురునానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ ముఖ్య అతిథిగా హాజరై నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఛాన్సలర్ డా. హెచ్.ఎస్. సైనీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణలు మరియు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టర్ డా.కలియరసన్, రిజిస్ట్రార్ డా.విశాల్ వాలియా, డైరెక్టర్ – ప్లానింగ్ డా.పార్థసారథి, డైరెక్టర్ డా.హరీష్ కుంద్రా, డైరెక్టర్ డా.సంజీవ్ శ్రీవాస్తవ, డీన్ డాక్టర్ అపర్ణ, డాక్టర్ రోజ్ మేరీ, డైరెక్టర్ -- ప్లేస్‌మెంట్, కార్పొరేట్ అఫైర్స్ శ్రీ వినయ్ చోప్రా తదితర ఉన్నతాధికారులు, అధ్యాపకులు మరియు పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ అధికారులు విద్యార్థులు మరియు తల్లిదండ్రులతో పరస్పరం మాట్లాడి, విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న విద్యా కార్యక్రమాలు, ఆధునిక మౌలిక వసతులు, ప్రయోగశాలలు, విద్యార్థి సేవలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పరిశ్రమలతో అనుసంధానం మరియు ప్లేస్‌మెంట్ అవకాశాల గురించి వివరించారు. తల్లిదండ్రులకు కూడా విశ్వవిద్యాలయ విద్యా విధానం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు మరియు విద్యార్థులకు అందించే వివిధ సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# ' పట్నంలో ' నేడు సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు

**376వ జయంతి ఉత్సవాలకు గౌడ కులస్తులు భారీ సంఖ్యలో తరలిరావాలి**

**గౌడ కులస్తులకు సీనియర్ కాంగ్రెస్ నేత తాళ్ల శ్రీశైలం గౌడ్ పిలుపు**



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (నగరనిజం) :** నేడు ఉదయం 11 గంటలకు ఇబ్రహీంపట్నం చెరువు కట్టమీద సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్ల శ్రీశైలం గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప మానవతావాది అని, ప్రజాస్వామిక స్ఫూర్తితో పోరాటం చేసిన సర్వాయి పాపన్న గౌడ్ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పాపన్న గౌడ్ కులవృత్తిని ఎంచుకొని, జీవనం సాగిస్తూ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత బహుజన మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించారని గుర్తు చేశారు. కుల, మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలనే.. సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో నాటి కాలంలోనే పాపన్న గౌడ్ పోరాటం చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. ఆధిపత్యాన్ని ఎదురించి, బహుజన రాజ్యస్థాపన చేసిన సర్వాయి పాపన్న గౌడ్ అందరికీ ఆదర్శనీయం అని కొనియాడారు. కావున ఇబ్రహీంపట్నంలో కనీవినీ ఎరుగని రీతిలో పాపన్న గౌడ్ జయంతిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. కావున ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని గౌడ సోదరులు, గౌడ కులస్తులు, గౌడ బంధువులు, కుల బాంధవులు, అభిమానులు, ప్రజాప్రతినిదులు అధిక సంఖ్యలో పాల్గొని, పాపన్న గౌడ్ జయంతిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ సమయానికి హాజరుకావాలని తాళ్ళ శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు.

# 'సాంకేతిక రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి'





**కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలి**

**ఓరియంటేషన్ డే కార్యక్రమంలో టాస్క్ సీఈవో నితిన్ కుమార్ రెడ్డి**

**సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (నగరనిజం) :** విప్లవాత్మక సమీకరణలకు అనుగుణంగా విద్యార్థుల ఆలోచన సరళిలో మార్పు రావాలని టాస్క్ సీఈవో నితిన్ కుమార్ రెడ్డి అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలని అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్ సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీలో నూతనంగా ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని చూసి భయపడకుండా దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏది వచ్చినా భయపడకుండా స్వీకరించి, అది మన జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో అర్థం చేసుకుని సద్వినియోగం చేసుకోవాలి. ఏ1 ని నేర్చుకుని మన అభివృద్ధికి ఉపయోగించుకుంటే కొత్త అవకాశాలను మనమే సృష్టించుకోగలం అని ఆయన పేర్కొన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ జీ.నాగయ్య మాట్లాడుతూ... తల్లిదండ్రులు తప్పక పేరెంట్-టీచర్ సమావేశాలకు హాజరై, విద్యార్థుల విద్యా ప్రగతిని తెలుసుకోవాలని సూచించారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు సమన్వయంతో కలిసి పనిచేసి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు. విధ్యార్థులు ఇష్టపడి చదివి, తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ పి.శేఖర్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల అందిస్తున్న విద్యా, సాంకేతిక అవకాశాలను వివరించారు. టెక్ ఫెస్టులు, సెమినార్లలో విద్యార్థులు ప్రథమ బహుమతులు సాధిస్తున్నారని తెలిపారు. అలాగే, కొంతమంది విద్యార్థులు మలేషియాలో పేపర్ ప్రజెంటేషన్‌కు ఎంపిక కావడం కళాశాల అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ జి.భగత్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం అకడమిక్ జ్ఞానానికే పరిమితం కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఇండస్ట్రీ ఇంటరాక్షన్ ద్వారా పరిశ్రమల అవసరాలు, ఉద్యోగ అవకాశాలు, అవసరమైన టెక్నికల్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, టీంవర్క్ వంటి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులకు సమానమైన అవకాశాలు లభిస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను నిరూపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ ప్రదీప్ కుమార్, యాజమాన్యం, డైరెక్టర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు నూతన విద్యార్థులు పాల్గొన్నారు.

# జెన్ జడ్‌ఉద్యమాలు.. తాత్కాలిక ఆవేశాలు, దీర్ఘకాలిక కష్టాలు

- **బూర నరసయ్య గౌడ్**
- **మాజీ ఎంపీ, ఉపాధ్యక్షుడు, బీజేపీ తెలంగాణ ,**

**PM విశ్వకర్మ యోజన తెలంగాణ రాష్ట్ర కన్వీనర్**



**హైద్రాబాద్ ఆగస్ట్ 17;** యువత నడిపిన వీధి ఆందోళనలు పదే పదే నాయకులను పదవి నుంచి తొలగించాయి లేదా ప్రభుత్వాలను నిర్దిష్ట విధానాలను విరమించుకునేలా చేశాయి. ఈ ఉద్యమాలు తరచుగా సునామీలా అకస్మాత్తుగా తీవ్ర ఉద్యమాలుగా పుడతాయి , డిజిటల్‌గా సమన్వయం చేయబడి నవి, భావోద్వేగపూరితమైనవి. అయితే ప్రారంభ ఉధృతి తర్వాత పాలన వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, సంస్థాగత సామర్థ్యం వంటి లోతైన వ్యవస్థలు ఎక్కువగా అలాగే ఉండిపోతాయి. మిగిలేది అలజడి, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం, రాజకీయ అనిశ్చితి, అసలు సమస్యలకు పాక్షిక లేదా తాత్కాలిక పరిష్కారాలు మాత్రమే. నాయకత్వం మారుతుంది. సమస్యలు కొనసాగుతా యి. ప్రధాన ఉద్యమాలను పరిశీలిద్దాం.

ఎ. అరబ్ వసంత ఉద్యమాలు

### 1. ట్యునీషియా - జాస్మిన్ విప్లవం (2010--2011)

వీధి వ్యాపారి మొహమ్మద్ బౌజీజీ ఆత్మాహుతి చేసుకోవడంతో ప్రారంభమైన ఈ ఆందోళనలు యువ నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అవినీతి, పోలీసు వేధింపులు, నిరంకుశ పాలనపై కేంద్రీకృతమయ్యాయి. 2011 జనవరిలో అధ్యక్షుడు జైనెల్ అబిదీన్ బెన్ అలీ పారిపోయాడు. సుమారు 350 మంది మరణించారు. నేడు అధికారం మళ్లీ అధ్యక్షుడి చేతిలో కేంద్రీకృతమై మరింత నిరంకుశ వ్యవస్థగా మారింది.

### 2. ఈజిప్ట్ - జనవరి 25 విప్లవం (2011)

కైరోలోని తహ్రీర్ స్క్వేర్‌ను కేంద్రంగా చేసుకుని విద్యార్థులు, వృత్తి నిపుణులు, కార్మికులు పోలీసు క్రూరత్వం, అవినీతి, నిరుద్యోగం, అత్యవసర చట్టాలు, రాజకీయ స్వేచ్ఛ లేకపోవడంపై ఐక్యమయ్యారు. సుమారు 900 మంది మరణించారు. హోస్నీ ముబారక్ తొలగించబడ్డాడు, కానీ సైనిక ఆధిపత్యం అబ్దెల్ ఫత్తాహ్ ఎల్-సీసీ నాయకత్వంలో తిరిగి వచ్చింది.

### 3. లిబియా - లిబియన్ విప్లవం (2011)

ముయమ్మర్ గడాఫీపై శాంతియుత ఆందోళనలు త్వరగా సాయుధ తిరుగుబాటుగా, అంతర్జాతీయ మద్దతు ఉన్న అంతర్యుద్ధంగా మారాయి. గడాఫీని పట్టుకుని చంపారు. సుమారు 25,000 మంది మరణించారు. సంస్థలు కుప్పకూలాయి; వార్ లార్డ్స్ , ట్రైబల్ గ్రూప్స్ మధ్య అంతర్యుద్ధం కొనసాగుతోంది.

### 4. సిరియా సిరియన్ తిరుగుబాటు (2011 నుంచి)

దార్షలో పాఠశాల పిల్లలను అరెస్టు చేసి హింసించినట్లు ఆరోపణలతో ప్రారంభమైన ఆందోళనలు రాష్ట్ర అణచివేతతో తీవ్రమయ్యాయి. అవినీతి, నిరంకుశ= పాలన, మతపరమైన విభేదాలు సంఘర్షణను మరింతగా పెంచాయి. 5,00,000 మందికి పైగా మరణించారు. దేశం ధ్వంసమై కొత్త జిహాది-సంబంధిత నాయకత్వం కింద ఉంది.

### 5. యెమెన్ -యెమెని విప్లవం (2011)

మూడు దశాబ్దాలకు పైగా పాలించిన అధ్యక్షుడు అలీ అబ్దుల్లా సాలెహ్ తొలగింపును యువత, పౌర సమాజ సంస్థలు డిమాండ్ చేశాయి. పేదరికం, నిరుద్యోగం, అవినీతి, గిరిజన-రాజకీయ పోషక వ్యవస్థ, నిరంకుశత్వం కారణాలు. సాలెహ్ అధికారాన్ని ఉపాధ్యక్షుడు అబ్దురబ్బు మన్సూర్ హాదీకి బదిలీ చేశాడు. వేలాది మంది మరణించారు; దేశం శాశ్వత అంతర్యుద్ధంలో విభజితమై ఉంది.

### 6. బహ్రెయిన్ -పెర్ల్ రౌండ్‌ఎబౌట్ తిరుగుబాటు (2011)

రాజ్యాంగ పాలన, ప్రాతినిధ్య ప్రభుత్వం, వివక్ష ముగింపు కోసం ఆందోళనకారులు పోరాడారు. 100 మందికి పైగా మరణించారు. రాజరికం మరింత బలపడింది. అరెస్టులు, హింస ఆరోపణలు, ఉద్యోగాల నుంచి తొలగింపులు, ప్రతిపక్ష సంస్థల రద్దు జరిగాయి.

### 7. మొరాకో -ఫిబ్రవరి 20 ఉద్యమం (2011)

పూర్తి విప్లవం కాకుండా సంస్కరణల కోసం ఉద్యమం. కొద్దిమంది మరణించారు. రాజరికం కొనసాగింది; ప్రధాన సమస్యలు మిగిలిపోయాయి, ఉద్యమం క్షీణించింది.

### 8. జోర్డాన్ -సంస్కరణల ఆందోళనలు (2011--2012)

రాజరికం రద్దు కాకుండా ఆర్థిక, రాజ్యాంగ సంస్కరణలు డిమాండ్ చేశారు. పరిమిత సంస్కరణలు అమలయ్యాయి, కానీ మూల సమస్యలు కొనసాగాయి

### బి. డిజిటల్, జెన్ జడ్ యుగ ఉద్యమాలు

9. హాంకాంగ్ -విచారణ చట్ట వ్యతిరేక ఉద్యమం (2019--2020)

విచారణ బిల్లుతో ప్రారంభమై ప్రజాస్వామ్యం, పోలీసింగ్ సంస్కరణ, స్వయంప్రతిపత్తి కోసం విస్తృత ఉద్యమంగా మారింది. ఫలితం: విస్తృత అరెస్టులు, విచారణలు, కార్యకర్తల దేశాంతరం, పౌర స్వేచ్ఛల సంకోచం.

### 10. థాయ్‌లాండ్ -యువ ప్రజాస్వామ్య ఉద్యమం (2020-2021)

విద్యార్థులు ప్రభుత్వాన్ని సవాలు చేసి కొత్త రాజ్యాంగం, రాజరిక సంస్కరణ గురించి బహిరంగంగా మాట్లాడారు- గతంలో నిషిద్ధం. జాతీయ చర్చ విస్తృతమైంది, కానీ ప్రభుత్వం, రాజరికం అలాగే ఉన్నాయి. లెస్-మజెస్టే చట్టం కింద విస్తృత విచారణలు జరిగాయి.

### 11. శ్రీలంక - అరగలయ (2022)

ఆర్థిక కుప్పకూలుడు యువత, వృత్తి నిపుణులు, మధ్యతరగతిని రాజపక్ష పాలనకు వ్యతిరేకంగా ఐక్యం చేసింది. విదేశీ మారక ద్రవ్య సంక్షోభం, ద్రవ్యోల్బణం, ఇంధనం-మందుల కొరత, రుణం, అవినీతి కేంద్ర కారణాలు. అధ్యక్షుడు గోతబయ రాజపక్ష పారిపోయి రాజీనామా చేశాడు; మహింద రాజపక్ష కూడా రాజీనామా చేశాడు. కొత్త నాయకత్వం వచ్చింది, కానీ ప్రధాన ఆర్థిక, పాలనా సమస్యలు కొనసాగుతున్నాయి.

### 12. ఇరాన్ -విమెన్, లైఫ్, ఫ్రీడమ్ (2022-2023)

నైతిక పోలీసుల కస్టడీలో మహ్సా అమినీ మరణం తప్పనిసరి హిజాబ్, రాజకీయ వ్యవస్థపై దేశవ్యాప్త యువత, మహిళల సవాలును ప్రేరేపించింది. సుమారు 550 మంది ఆందోళనకారులు మరణించారు. పాలన కొనసాగింది, నియంత్రణ మరింత బిగించింది.

### 13. ఫ్రాన్స్ - పెన్షన్ సంస్కరణ ఆందోళనలు (2023)

విద్యార్థులు, యువ కార్మికులు యూనియన్లతో కలిసి రిటైర్మెంట్ వయస్సు పెంచే ప్రణాళికకు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. కొన్ని నగరాల్లో అల్లర్లు, అగ్నిప్రమాదాలు, గాయాలు, పోలీసులతో ఘర్షణలు జరిగాయి. విధానం అమలయింది; ప్రభుత్వం కొనసాగింది.

14. బంగ్లాదేశ్ -విద్యార్థి-ప్రజా తిరుగుబాటు (2024)

ప్రభుత్వ ఉద్యోగ కోటాలపై ప్రచారం మరణకరమైన అణచివేత తర్వాత షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమంగా మారింది. సుమారు 1,400 మంది మరణించారు. హసీనా రాజీనామా చేసి దేశం విడిచి వెళ్లింది. పరిపాలనా అనిశ్చితి, ఆర్థిక అలజడి, రాజకీయ విచ్ఛిన్నం తర్వాత కొనసాగాయి.

### 15. నేపాల్ -జెన్ జడ్ అవినీతి వ్యతిరేక ఆందోళనలు (2025)

ప్రధాన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల నిషేధంతో ప్రారంభమై అవినీతి, నెపోటిజం, రాజకీయ ప్రత్యేక హక్కులపై తిరుగుబాటుగా మారింది. సుమారు 77 మంది మరణించారు. ప్రధానమంత్రి కె.పి. శర్మ ఓలి రాజీనామా చేశాడు; నిషేధం ఎత్తివేయబడింది, కొత్త ప్రధానమంత్రి ప్రమాణ స్వీకారం చేశాడు. అవినీతి, నెపోటిజం, నిరుద్యోగం పరిష్కారం కాలేదు.

### 16. భారత్ -పరీక్షలు, నియామకాలు, ఉపాధి ఆందోళనలు

భారత్‌లో ఒకే దేశవ్యాప్త "జెన్ జడ్ విప్లవం" కాకుండా అనేక యువ ఉద్యమాలు జరిగాయి-పరీక్ష అక్రమాలు, అగ్నిపథ్, ప్రభుత్వ రంగ ఉపాధి సమస్యలపై. ఇటీవలి దృష్టి చీజుఖు పేపర్ లీక్, సంబంధిత నియామక సమస్యలపై ఉంది.

### విశ్లేషణాత్మక నమూనా

నిర్దిష్ట విధాన సమస్యలు-పన్నులు, కోటాలు, బిల్లులు లేదా పరీక్ష సమగ్రత-కొన్నిసార్లు ఫలితాలు ఇస్తాయి. లోతైన నిర్మాణాత్మక సమస్యలు చాలా అరుదుగా పరిష్కారమవుతాయి. నాయకత్వ మార్పు మాత్రమే శాశ్వత వ్యవస్థాగత పరిష్కారాలను ఇవ్వలేదు. అనిశ్చితి, ఆర్థిక మందగమనం లేదా పాత లోపాలు కొత్త ముఖాల కింద తిరిగి కనిపిస్తాయి.

### భారతీయ "కాక్రోచ్" రూపం

పరీక్ష సమగ్రతపై ఇటీవలి భారతీయ సమీకరణ గ్లోబల్ తరంగంతో ఉపరితల సారూప్యతలను పంచుకుంటుంది-డిజిటల్ వేగం, తరం భాష. అయితే "కాక్రోచ్" బ్రాండింగ్ కింద ఇది నిజమైన విద్యార్థి ఆందోళనలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధానమంత్రి మోదీ, భారత సైన్యం, నాగరిక గౌరవ వ్యక్తీకరణలపై నిరంతర శత్రుత్వాన్ని పొరలు పొరలుగా పేర్చింది. రామాయణంలో మారీచుడు శత్రు ఉద్దేశాన్ని దాచుకోవడానికి బంగారు జింక రూపం ధరించినట్లు, ఈ ఉద్యమం యువ ముసుగు వాడుతోంది. సనాతని, హిందూ చిహ్నాలపై నిరంతర లక్ష్యం, ఆత్మవిశ్వాసం ఉన్న భారత్కు వ్యతిరేకమైన నెట్వర్కుల విస్తృత ప్రచారం, గత కాంగ్రెస్ ఆధిపత్య దశాబ్దాల్లో స్వేచ్ఛగా నడిచిన శక్తుల కొనసాగింపు - ఇవన్నీ ఇది కేవలం పరీక్షల గురించి కాదని సూచిస్తాయి. ప్రజాస్వామ్య ఎన్నికల పోటీలో సాధించలేనిదాన్ని ఇప్పుడు వీధి ఒత్తిడి, నారేటివ్ యుద్ధం ద్వారా సాధించాలని చూస్తున్నారు.

### భారత్ రికార్డు, అవసరమైన ప్రతిస్పందన.

ప్రస్తుత ప్రభుత్వం కింద భారత్ కొలవదగిన సంక్షేమ పంపిణీ, మౌలిక సదుపాయాలు, డిజిటల్ పబ్లిక్ గూడ్స్, ఆర్థిక అధికారికీకరణ, పేదరిక నిర్మూలన, అంతర్జాతీయ స్థానం వంటి రంగాల్లో పురోగతి సాధించింది. గత రాజకీయ ఏర్పాట్లు దశాబ్దాల అవకాశాలు ఉన్నప్పటికీ ఈ ఫలితాలను సాధించలేకపోయాయి. భారత్‌ను నిజంగా గొప్ప దేశంగా చూడాలనుకునే భారతీయులు నిజమైన విద్యార్థి ఆందోళనలను, వాటిని ముసుగుగా వాడుకునే ఉద్యమాల నుంచి వేరుచేయాలి. భారత్ రాజకీయ అతీతంగా "కాక్రోచ్ హంటర్స్" ఏర్పాటు కావడం అవసరం. అంటే అలజడికి అలజడితో సమాధానం ఇవ్వడం కాదు. ఇది స్పష్టమైన, అరాజకీయ పౌర ప్రతిస్పందన - సంస్థాగత విజయాలను రక్షించడం, బ్రాండింగ్ వెనుక ఉన్న ఆలోచనా కొనసాగింపును బహిర్గతం చేయడం, ఆకాంక్షను నాశనం కాకుండా నిర్మాణం వైపు మళ్లించడం. సంస్థాగత లక్ష్యం లేని వీధి శక్తి కేవలం శిథిలాలను మిగులుస్తుంది. ప్రదర్శనాత్మక కోపం స్థానంలో దేశ నిర్మాణం యొక్క ఓపికగల పనిని ఉంచనివారిదే భారత్ భవిష్యత్తు.

# తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ప్రజల అవసరాల కోసం ఉందా లేక ఆంధ్ర ప్రభుత్వ మెప్పు కోసం పని చేస్తుందా

- **కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్.రెడ్డి.**





**వీపనగండ్ల.ఆగస్టు.17:(నగర నిజం)**తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ప్రజల సమస్యలు తీర్చడం కోసం పనిచేస్తుందా లేక ఆంధ్ర ప్రజల మెప్పు కోసం అక్కడి ప్రభుత్వం మెప్పుకోసం పనిచేయడం జరుగుతుందా అని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు సోమవారం నాడు కేతపల్లి నుండి వచ్చే హై లెవెల్ బీమా కాలువ 27 28 29 డిస్ట్రిబ్యూటర్ల కు నీళ్లు రావడంలేదని రైతుల ఫిర్యాదు మేరకు ఆయన కాలువ వెంబడి వెళ్లి పరిశీలించారు.రంగసముద్రం నుండి బీమా లిఫ్ట్ ద్వారా వీపనగండ్ల తదితర గ్రామాల రైతులకు సాగునీరు సకాలంలో అందించి ఉంటే ఈరోజు పంటలు ఎండిపోకుండా కాలువల ద్వారా సాగునీరు అందేది అని ఆయన అన్నారు ఆంధ్ర ప్రజలకు ఉపయోగపడే.పోతిరెడ్డిపాడుకు కృష్ణా నది ద్వారా సాగునీరు పోతూ ఉంటే శ్రీశైలం డ్యాం కు నీళ్లు ఏ విధంగా వస్తాయని ఆయన ప్రశ్నించారు అంతేగాక కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందాలంటే ఆంధ్రకు పోతిరెడ్డిపాడు ద్వారా పోతున్న నీటిని అరికట్టవలసినటువంటి అవసరము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఈ కొల్లాపూర్ నియోజక వర్గానికి సంబంధించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆ బాధ్యత ఉందని ఆయన అన్నారు అవి ఏమీ చేయకుండా సాగునీరు కాలువల ద్వారా రైతులకు ఏ రకంగా అందుతుందని ఆయన ప్రశ్నించారు అంతేకాక గత ప్రభుత్వ హాయంలో సాగునీటి కాలువలకు జమ్ము గడ్డి పూడిక తీత పనులు తదితర వాటిని తీసివేయడం జరిగిందని ఆ విధంగా తీసివేయడం వల్ల రైతులకు పుష్కలంగా సాగునీరు అందిదని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేయకపోవడం వల్ల కాలువల ద్వారా జమ్ము గడ్డి ఉంది అని ఆయన విమర్శించారు కమిషన్లకు కక్కుర్తి పడి కాలువల మరమ్మత్తులు చేసినట్లుగా బిల్లులు డ్రా చేసుకొని ప్రస్తుత మంత్రి సహచర్లు తింటున్నారని ఆయన విమర్శించారు తక్షణమే కాలువల మరమ్మత్తులు చేయించి రంగసముద్రం నుంచి వచ్చే సాగునీటిని మరియు బీమా కాలువల నుండి వచ్చే నీటిని విడుదల చేసి ఎండుతున్న పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు అనంతరం చిన్నంబావి మండల కేంద్రంలో రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు చిన్నంబావి మండలం లోని ప్రతి గ్రామానికి సాగునీరు అందించి ఈ ప్రాంత రైతులను కాపాడాలని వారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించకపోతే రానున్న రోజుల్లో నేషనల్ హై దిగ్బంధం చేసేందుకు కూడా సిద్ధమని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కే సత్యనారాయణ గౌడ్ మాజీ ఎంపీపీ కమలేశ్వరరావు పుల్గర్ సర్పంచ్ బాలరాజు ఏతం బాలస్వామి జొల్లు నారాయణ కరుణాకర్ రెడ్డి దయాకర్ రెడ్డి వేణు మాధవరెడ్డి మాజీ సర్పంచ్ రామేశ్వరరావు బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరనిజం
తెలుగు దిన పత్రిక
18 మంగళవారం,ఆగస్టు,2026

# ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో బాలుడు పట్టివేత




మేడిపల్లి, ఆగస్టు 17, (నగర నిజం) : మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరిగిన ద్విచక్ర వాహనాల చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. చోరీలకు పాల్పడిన 14 ఏళ్ల బాలుడిని మేడిపల్లి క్రైమ్ టీమ్ గుర్తించి అదుపులోకి తీసుకుంది. అతని వద్ద నుంచి చోరీకి గురైన నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ డి. జెలెండర్ రెడ్డి పర్యవేక్షణలో క్రైమ్ టీమ్ విశ్వసనీయ సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో చెంగిచెర్లకు చెందిన బాలుడిని గుర్తించి పట్టుకున్నారు. విచారణలో గత నెల రోజుల వ్యవధిలో తన వ్యక్తిగత అవసరాల కోసం నాలుగు ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు బాలుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన వాహనాలను విక్రయించాలనే ఉద్దేశంతో ఓ బహిరంగ ప్రదేశంలో దాచిపెట్టినట్లు బాలుడు వెల్లడించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దర్యాప్తులో డీఎస్ఐ శ్రీను, ఏఎస్ఐ బాలసింగ్, హెడ్ కానిస్టేబుళ్లు సునీల్, రాము, కానిస్టేబుళ్లు మహిపాల్, వినోద్, హరిబాబు, శివకుమార్, మహిళా పోలీస్ కానిస్టేబుల్ విశాలి పాల్గొన్నారు. దర్యాప్తు అనంతరం చట్ట ప్రకారం బాలుడికి నోటీసు జారీ చేసి, తదుపరి న్యాయపరమైన చర్యల కోసం బాల న్యాయ బోర్డు ఎదుట హాజరు కావాలని ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు. మేడిపల్లి క్రైమ్ టీమ్ చాకచక్యంగా వ్యవహరించి చోరీ కేసులను ఛేదించిన తీరును ఉన్నతాధికారులు అభినందించారు.

# విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఎదగాలి



వీపనగండ్ల. ఆగస్టు17(నగరనిజం). ప్రచురణార్థమై. స్వాతంత్ర పోరాటంలో పాల్గొని మనకు స్వేచ్ఛ వాయువులను ప్రసాదించిన త్యాగధనులైన నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలని కల్వరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఏ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా వివిధ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు.. అభినందన సమావేశం.. సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించడం జరిగింది. సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వారి యొక్క పోరాటాల ఫలితంగానే మనకి విద్య.. ఉద్యోగాలు.. ఉపాధి లభించాయని వాటిని ఉపయోగించుకొని బాగా చదివి పై స్థానంలో అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల అభివృద్ధి... విద్యార్థుల ప్రతిభను గుర్తించి చ.. మరింత ప్రోత్సహించడానికి పూర్వ విద్యార్థులు.. శ్రేయోభిలాష్యులు.. ప్రజా ప్రతినిధులు దాతలు గా ముందుకు వస్తున్నారని వారికి వందనాలు అని అన్నారు. దాతలలో.. 1. డాక్టర్ టీ. విజయకుమార్ రెడ్డి గారు 15000...2. పూర్వ విద్యార్థుల తొలి కిరణం (2000..2001)5000..మరియు 32 వేల రూపాయలు విలువ గల వాటర్ ఫిల్టర్.. 3. దొండా యిపల్లి గ్రామ నివాసి పోతుల రాజశేఖరరెడ్డి గారు 8000..4. బండారి రమేష్ గారు 5000..5. చెనమోని దేవేంద్రమ్మ ఆంజనేయులు10 వ వార్డు మెంబర్ 4000.. 6. భవ్యశ్రీ సాఫ్ట్ వెర్ 2000..7. ఏ. రవీందర్ గౌడ్ గారు వా×జ ఏజెంట్ 1116..8. బి. రాముడు గ్రామ సర్పంచ్ గారు..వాష్ లిక్విడ్ విద్యార్థులకు అందించడం జరిగింది. దాతల సహకారం వలన.. విద్యార్థుల లో సేవాగుణం ఏర్పడి.. భవిష్యత్ లో మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి మేలు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమం లో విద్యార్థులు.. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్రను అడ్డుకోవాలి

- ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకుల ధర్నా
- పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి ఆర్థిక సాయం విడుదల చేయాలని డిమాండ్




ఎల్బీనగర్, ఆగస్టు 17: కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా నాయకులు సోమవారం ఎల్బీనగర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ, హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మి అంశంలో ప్రభుత్వం హైకోర్టులో సరైన కౌంటర్ దాఖలు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం 2014లో ప్రారంభించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు లక్షలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాయని తెలిపారు. ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని అమలు చేయకుండా పథకాన్నే రద్దు చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారుల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డల సంక్షేమానికి సంబంధించిన పథకాలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకులు శైలజ, రమాదేవి, దేవి, రాధిక, విజయలక్ష్మి, శ్రీలత, కల్పన, వసంత, లక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# కమలా నగర్‌లో చెత్త డంపింగ్‌పై కాలనీవాసుల ఆగ్రహం

- కమిషనర్ కు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపణ



ఎల్బీనగర్, ఆగస్టు 17: కమలా నగర్ రోడ్ నంబర్ 17లో పార్కు పక్కన, నివాసాల మధ్య చెత్త డంపింగ్ చేస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి చెత్తను తీసుకొచ్చి ఇళ్ల మధ్యలో వేస్తుండటంతో రోజురోజుకూ చెత్త కుప్పలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని, దోమలు, ఈగల బెడద కూడా పెరిగిందని వారు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పార్కు పక్కనే చెత్తను డంపింగ్ చేయడం వల్ల పార్కు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యను కమిషనర్ కి పలుమార్లు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లామని కాలనీవాసులు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఫోన్ ద్వారా కూడా సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన లేకపోవడంతో సమస్య అలాగే కొనసాగుతోందని వారు ఆరోపించారు. ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి, ఇకపై నివాసాల మధ్య చెత్త డంపింగ్ చేయకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# వైదేహి నగర్‌లో ది సలోన్ ప్రారంభం



ఎల్బీనగర్, ఆగస్టు 17: బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ది సలోన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై సలోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సలోన్ నిర్వాహకులు అమూల్య రాజశేఖర్ రెడ్డి, మేక లోకేష్ గౌడ్, మేరెడ్డి మేఘన మధుకర్ రెడ్డిని వారు అభినందించారు. నూతనంగా ప్రారంభమైన సలోన్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైదేహి నగర్ కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ మాజీ అధ్యక్షులు నూతి శ్రీనివాస్, డివిజన్ ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు సురేష్ కుమార్, నాయకులు చిన్న యాదవ్, కిషోర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేదింట ఆడపడుచు వివాహానికి వెస్సో సాయం




హైద్రాబాద్ ఆగస్ట్ 17;కాకినాడ జిల్లా కత్తిపూడి కి చెందిన తాళాబత్తుల బ్రహ్మం (44) రోజువారీ వేతనానికి కర్ర పని చేసుకుంటూ అతి తక్కువ ఆదాయం పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన కుమార్తె పావని వివాహం ఆగస్టు 16న జరుగనుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో, తన కుమార్తె వివాహాన్ని సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన ఖర్చులను భరించే స్థోమత ఆయనకు లేదు. అత్యంత నిరాడంబరంగా తమ ఇంటి ముంగిటే జాతీయ రహదారి పక్కన వివాహం నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది! ఈ పరిస్థితుల్లో స్థానిక సంఘ నాయకుల సహాయంతో వెస్సో ట్రస్ట్ సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్న తండ్రి తమ పరిస్థితి వివరించి, పావని వివాహానికి ఆర్థిక సహాయం అందించమని వెస్సో ట్రస్టు ను కోరారు. వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో వారికి 54,116/- రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ పేద వధువు వివాహానికి బాసటగా నిలిచిన గౌరవ దాతలు అందరికీ పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు.

# మెదక్ నిరుద్యోగ యువత భవితకు మెసిక్ పోర్టల్ భరోసా



మెదక్, ఆగస్టు 17 (నగర నిజం) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని శాంతా బయోటిక్స్ పరిశ్రమలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రత్యేక చొరవతో రూపొందించిన మెదక్ ఉద్యోగాలు, నైపుణ్యాలు, పరిశ్రమల అనుసంధాన వేదిక మెసిక్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగార్థులు, నైపుణ్య సంస్థలు, స్థానిక పరిశ్రమలను ఒకే ధ్రువీకరించబడిన డిజిటల్ వేదికపైకి తీసుకురావడమే మెసిక్ పోర్టల్ ఉద్దేశమన్నారు. జిల్లా కలెక్టరేట్ సమాచార సాంకేతిక బృందం, ఐటీసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఉపాధి, నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలకు అనుసంధానించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందన్నారు. మెదక్ జిల్లాలోని పారిశ్రామిక శిక్షణ సంస్థలు, పాలిటెక్నిక్‌లు, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల కోసం రెండు దశల నమోదు విధానాన్ని రూపొందించినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థుల వివరాలను సంబంధిత విద్యాసంస్థలు ధ్రువీకరించిన అనంతరం వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను సరిపోల్చే విధంగా పోర్టల్ పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి కళాశాల నుంచి అధ్యాపక సమన్వయకర్తలు ఉద్యోగ నియామకాల సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలోనే ఉద్యోగ అవకాశాలుజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో సుమారు 100 పరిశ్రమలు ఉన్నప్పటికీ, తమ నైపుణ్యాలకు అనుగుణంగా ఏ పరిశ్రమలో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో యువతకు పూర్తిస్థాయిలో సమాచారం అందడం లేదన్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లాలోనే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మెసిక్ పోర్టల్ దోహదపడుతుందని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా పోర్టల్‌లో నమోదు చేసుకుని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని పరిశ్రమలకు సైతం పోర్టల్‌లో ప్రత్యేక ప్రవేశ సదుపాయాలు కల్పించి వినియోగ వివరాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, ఏఎల్‌ఏ చైర్‌పర్సన్ సుబ్బారావు, ఐటీసీ ప్రతినిధి ఆనంద్, ఈడీఎం సందీప్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులుగా ఏనుగు నరేందర్ రెడ్డి నియామకం

- తెలంగాణ సర్పంచుల ఫోరం జేఏసీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నిక
- గ్రామాల సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి అహర్నిశలు పాటుపడతా
- జిల్లాలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తా
- రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తా
- సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు, తుర్కగూడ సర్పంచ్ ఏనుగు నరేందర్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (నగరనిజం) : సర్పంచుల ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఇబ్రహీంపట్నం మండలం తుర్కగుడ గ్రామ సర్పంచ్ ఏనుగు నరేందర్ రెడ్డి సోమవారం ఎన్నికయ్యారు. తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, సుర్వీ యాదయ్య గౌడ్ వ్యవస్థాపక అధ్యక్షులు, (జేఏసీ) వారి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఏనుగు నరేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో మరియు మండల సమగ్ర అభివృద్ధి గ్రామాల పురోభివృద్ధి, ప్రజల సంక్షేమం మంచి పరిపాలన సాధ్యమయ్యే విధంగా సమిష్టి కృషిని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఫోరం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి వర్యులు శ్రీనివాస్ గౌడ్, తదితర చేతుల మీదుగా ఏనుగు నరేందర్ రెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏనుగు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... నాపై నమ్మకంతో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందున బాధ్యత మరింత పెరిగిందని, అందరి సహకారంతో జిల్లా మండల పరిధిలోని గ్రామాలు అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా సర్పంచులకు గౌరవ వేతనం కూడా పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడతానన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తానని అన్నారు. సర్పంచులకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తానని చెప్పారు. నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, చిత్తశుద్ధితో నిస్వార్థంగా పనిచేస్తానని తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, సర్పంచుల సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థల బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు తమ వంతుగా తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. నాపై మరింత బాధ్యత పెరిగిందని, అదే బాధ్యతతో గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి, పెద్దపీట వేస్తానని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచుల సమిష్టి కృషి చాల అవసరం అన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అన్ని గ్రామాల సర్పంచులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికకు సహకరించిన బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులకు, రాష్ట్ర సర్పంచుల ఫోరం కమిటీ పెద్దలకు, ఆయన ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఏనుగు నరేందర్ రెడ్డి నియామకం పట్ల గ్రామ ప్రజలు, పలువురు నేతలు, హర్షం వ్యక్తం చేశారు.

నగరనిజం
18 మంగళవారం,ఆగస్టు,2026

# ఘనంగా ముగిసిన 2వ ఇండిపెండెన్స్ కప్-2026

- స్కేటర్ల అఫిలియేషన్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి




ఎల్బీనగర్, ఆగస్టు 17: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం ఏ టైప్ క్వార్టర్స్ సమీపంలోని వనస్థలి స్కేటింగ్ రింక్‌లో నిర్వహించిన రోలర్, ఇన్‌లైన్ హాకీ 2వ ఇండిపెండెన్స్ కప్-2026 పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజగోపాల్, సంయుక్త కార్యదర్శి జి. అజయ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ స్కేటర్ల క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని అభినందించారు. స్కేటర్లు, తల్లిదండ్రుల చిరకాల కోరికగా ఉన్న టీఆర్ఎస్ఏ అఫిలియేషన్ సమస్య పరిష్కారానికి వ్యక్తిగతంగా చొరవ తీసుకుంటానని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ సోనీ బాల దేవిని కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన సాంకేతిక కమిటీ ఛైర్మన్ సత్య, ఉపాధ్యక్షులు అబ్దుల్ ఖురేషి, వట్టి శ్రీను, ముస్తఫా, అహ్మద్, అఫీజ్, సిద్దిక్, కోమల్, ఆకాష్‌ల సేవలను నిర్వాహకులు అభినందించారు. నిర్వహణ కమిటీ సభ్యులు సాయి, వంశీ కృషిని కూడా కొనియాడారు. టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన స్కేటర్లు, తల్లిదండ్రులు, కోచ్‌లు, తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నిర్వహణ కమిటీ ఛైర్మన్ టంగుటూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఫలహార బండి కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్, ఆగస్టు 17: బోనాల పండుగ నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నిర్వహించిన అమ్మవారి ఫలహార బండి కార్యక్రమాల్లో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఫలహార బండి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పలు డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుజాతకు ఉత్తమ ప్రతిభ పురస్కారం ఘనంగా సన్మానసభ



నాగర్ కర్నూల్ జిల్లా ఆగస్టు 18 ( నగరనిజం ప్రతినిధి ఎర్రం నాగేంద్రం) సమగ్ర శిక్షా అభియాన్ పర్యవేక్షకురాలు సుజాతకు 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ముఖ్య అతిథి చిన్నారెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లురవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ల తో ఉత్తమ సూపరింటెండెంట్ ఉద్యోగ ప్రతిభ పురస్కారం అందుకున్న సందర్భంగా సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయ ఉద్యోగులు, అధికారులు ఆమెను ఘనంగా అభినందించారు. డీఈఓ రమేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపి, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో అమలవుతున్న వివిధ విద్యా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని డీఈఓ రమేష్ కుమార్ సూచించారు. ముఖ్యంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ స్కూళ్ల నిర్వహణను మరింత మెరుగుపరిచి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల విద్యా ఫలితాలను మెరుగుపరచడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా బోధన, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా సుజాతకు లభించిన పురస్కారం ఇతర అధికారులు, ఉద్యోగులకు సైతం స్ఫూర్తిదాయకమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# యాచారం మండల విద్యాశాఖాధికారి అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి
- రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేత



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (నగరనిజం) : యాచారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉపాధ్యాయుల పట్ల జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్న అవకతవకలు, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన డిప్యుటేషన్ లపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ది స్టేట్ టీచర్స్ యూనియన్, తెలంగాణ స్టేట్ (ఎస్టీయూటీఎస్) రంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పుట్టపాక ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖాధికారికి ప్రాతినిధ్యం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డీఈఓ ఆదేశాలతో ఎస్ఎస్ సీ పరీక్షల విధులకు హాజరైన మహిళా ఉపాధ్యాయురాలికి సంబంధించి సెలవు ఖాతాలో కోత విధించిన అంశంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. జీఓ నెంబర్ 25 నిబంధనలకు విరుద్ధంగా గడ్డమల్లయగూడ పాఠశాల ఉపాధ్యాయుని డిప్యుటేషన్ విషయంలో జరిగిన అక్రమాన్ని పరిశీలించాలని కోరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు, డిప్యుటేషన్ విషయంలో సీనియారిటీ, నిబంధనలను పక్కనపెట్టి వ్యక్తిగత అనుకూలతలకు ప్రాధాన్యం ఇచ్చారనే ఆరోపణలపై విచారణ జరపాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి జారీ చేసిన డిప్యుటేషన్ ఉత్తర్వులను అమలు చేయడంలో జరిగిన జాప్యం, నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని పాఠశాలలకు సక్రమంగా హాజరు కానీ ఉపాధ్యాయుల పట్ల ఒక విధంగా, విధులకు క్రమం తప్పకుండా హాజరవుతున్న ఉపాధ్యాయుల పట్ల మరో విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి అందరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను నిష్పక్షపాతంగా పరిష్కరించి, విద్యాశాఖలో పారదర్శకతను, నిబంధనల అమలును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. వాస్తవాలను వెలికితీసేందుకు సమగ్ర విచారణ చేపట్టి, తప్పు చేసినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా నాయకులు, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటుతాం -బీఆర్ఎస్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్

- సమిష్టి కృషితో ఎన్నికలను ఎదుర్కొంటామన్న కొనమొల్ల
- కొనమొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన గులాబీ అధ్యక్షతన గులాబీ పార్టీలో చేరిన 119 డివిజన్ యువకులు



రాజేంద్రనగర్, ఆగస్టు 17(నగరనిజం ప్రతినిధి)..గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతామని గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ 119 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ విశ్వాసం ప్రకటించారు. కార్తీక్ రెడ్డి సారథ్యంలో సమిష్టి కృషితో గ్రేటర్ ఎన్నికలను ఎదుర్కొంటామని ఆయన ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ 119 కొత్వాల్ గూడ డివిజన్ కు చెందిన యువకులు పార్టీ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన భారీ సంఖ్యలో కార్తీక్ రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాస్.... గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపును ఏ పార్టీ అడ్డుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం పోయిందన్న ఆయన.... ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిన తరుణంలోనే కాంగ్రెస్ తో పాటు ఇతర పార్టీలకు చెందిన చాలామంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని కొనమొల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో కార్తీక్ రెడ్డి సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఆవిర్భవించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ప్రకటించారు. కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో సమిష్టి కృషితో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను ఎదుర్కొంటామని, ఖచ్చితంగా గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతామని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. శంషాబాద్ 119 డివిజన్ పరిధిలో ఇతర పార్టీల నుంచి చాలామంది బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ఆయన చెప్పారు.

# రైతులకు సాగునీరు అందించాలి: మాజీ ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్ రెడ్డి



పాన్ గల్ ఆగస్టు 18 ( నగరనిజం ప్రతినిధి ఎర్రం నాగేంద్రం) కొల్లాపూర్ నియోజకవర్గంలోని పాన్ గల్ మండలంలోని దవాజిపల్లి, బండపల్లి, కేతేపల్లి , కాల్వరాల గ్రామాలలో సోమవారం కేఎల్ ఐ, భీమా కాలువలను పరిశీలించి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కార్ ఉన్నపుడు ఎలా సాగునీరు అందించారో ఇప్పుడు ఎలా ఉందో ప్రజలకు అర్థంఅయిందని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న మంత్రి కి రైతులకు సాగునీరు అందించడంలో విఫలం అయ్యారని, ఈ ప్రభుత్వం రైతులకు ఒక్క పంటకు కూడా సాగునీరు అందించడం లేదు అంటే ప్రభుత్వానికి రైతులను ఆదుకొలవాలన్న సోయి లేదని మండిపడ్డారు. శ్రీశైలంలో నిండుగా నీరు ఉన్న తెలంగాణ ప్రాంతానికి నీరు తీసుకోవడం లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది అని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం పోతిరెడ్డి పాడు ప్రాజెక్టు కు నీటిని తరలిస్తుంటే చోద్యం చేస్తుంది అని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆంధ్ర రాష్ట ప్రయోజనాలకోసం పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండాలి

- ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ లోకి మార్చుకునే అవకాశం
- నాలుగు నియోజకవర్గాల ఓటర్ జాబితా విడుదల
- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్




వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 నగర నిజం:స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సమావేశం నిర్వహించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ారx=) ప్రక్రియపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా పునఃపరిశీలనకు సంబంధించిన ప్రక్రియ, చేపట్టాల్సిన చర్యలు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు.ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి మార్పులు, చేర్పులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్ణీత ప్రక్రియ ప్రకారం తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, ఓటర్ల జాబితా సక్రమంగా మరియు పారదర్శకంగా రూపొందించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఒక కుటుంబంలో ఉన్న కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ లో ఉండే విధంగా మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇంకేమైనా మార్పులు, చేర్పులు ఉంటె తెలియ చేయాలనీ కోరారు. వికారాబాద్ జిల్లా నాలుగు నియోజక వర్గాల వారిగా ఓటర్ల జాబితా ను విడుదల చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిడులకు ఓటర్ లిస్టు ప్రతులను అందజేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటా చారి, డి ఆర్ ఓ స్వర్ణ లత, ఎన్నికల విభాగం సుపరింటెన్డేంట్ నేమత్ హాలి, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహ రెడ్డి, తహసిల్దార్లు లక్ష్మి నారాయణ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఉన్న పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసిన సిపిఎం నేతలు




కొల్లాపూర్ ఆగస్టు 18 ( నగరనిజం ప్రతినిధి ఎర్రం నాగేంద్రం) భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి అధికారులకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు సూర్యవంశం రాము, కమలాకర్లు మాట్లాడుతూ పానుగల్ మండలంలో ఉన్న గ్రామ పంచాయతీలలో వివిధ సమస్యలను పరిష్కారం చేయాలని, గ్రామాల్లో త్రాగునీరు, కరెంటు, సిసి రోడ్లు, డ్రైనేజీల సమస్యలు పరిష్కారం చేయాలని, స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ పాన్గల్ మండలంలోని కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బసౌకర్యాల్లోని గ్రామాలకు తక్షణమే బసౌకర్యాలు కల్పించాలని, అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని, వి బి జి రామ్ జి పనులు చేసిన కూలీలకు, పెండింగ్ కూలీ డబ్బులు ఇవ్వాలని అన్నారు. రైతులకు సాగునీరు చివరి ఆయకట్టు వరకు విడుదల చేయాలని కోరారు, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు, గ్రామాలలో వైద్య సేవలు వైద్య క్యాంపులు నిర్మించాలని అన్నారు, ప్రభుత్వ అధికారులు మండలంలో ఉన్న పాఠశాలలను సర్వే, తనిఖీలు నిర్వహించి సమస్యలను పరిష్కారం చేయాలని, విద్యార్థుల తరగతులకు అనుగుణంగా తరగతి గదులను నిర్మించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు, ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలు అందరికీ కూడా వర్తింపజేయాలని కోరారు.

# మాసాయిపేట విద్యుత్ ఏఈకి ఫిర్యాదు

మాసాయిపేట, ఆగస్టు 18 (నగర నిజం) : మాసాయిపేట మండలంలోని తూప్రాన్ సర్వీస్ రోడ్డులో కొత్తగా ప్రతిపాదించిన 33 కేవీ విద్యుత్ లైన్ పనులను నిలిపివేయాలని గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మాసాయిపేట ఎన్‌హెచ్-44 ప్రధాన రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో ఈ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం ఉన్న 30 కేవీ విద్యుత్ లైన్ పూర్తయితే తూప్రాన్ సర్వీస్ రోడ్డులో నివసిస్తున్న గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్ ఏర్పాటు వల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటూ పనులను నిలిపివేసి, ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని అధికారులను కోరారు. ఈ మేరకు మాసాయిపేట విద్యుత్ సహాయ ఇంజినీర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించారు.

# ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

- మెదక్ జిల్లా (నగర నిజం నర్సాపూర్ నియోజకవర్గ ప్రతినిధి) ఆగస్టు 17.



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ మాసాయిపేట్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు వచ్చాయని ఎంపీ ఓ నరేష్ వెల్లడించారు. మొదటి ఫిర్యాదు 33 కెవి లైన్ ఊరు మధ్యలో నుండి వెళుతుండడంతో రేడియేషన్ సమస్య వస్తుందని హై టెన్షన్ తో కూడుకున్న కరెంటు ఉండడంతో గ్రామం నుండి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తీసుకువెళ్లాలని ఫిర్యాదు చేసినట్లు రెండవది ఫర్టిలైజర్ యాప్ ద్వారా చిన్న రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ఈ యాప్ ద్వారా కాకుండా పట్టాదారు పాస్ బుక్ ద్వారా యూరియా పంపిణీ చేయాలని రైతులు ఫిర్యాదు చేశారు, మూడవ ఫిర్యాదు ఇందిరమ్మ ఇల్లు సాంగ్స్ చేసి 100 గజాల స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారని తెలిపారు. ఎంపీ ఓ నరేష్ మాట్లాడుతూ వీటిని వెంటనే పరిష్కరించి ఆన్లైన్ ద్వారా కలెక్టర్ గారికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్వో జ్ఞాన జ్యోతి, ఎంపీ ఓ నరేష్, మండల స్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ గేయం 'వందేమాతరం'ను కాంగ్రెస్ అగౌరవపరచడం దేశద్రోహ చర్య

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాశీచందర్ రావు
- వందేమాతరం ఆలాపన వేళ కాంగ్రెస్ అగ్రనేతల బాధ్యతారాహిత్యం -- యావత్ దేశానికి క్షమాపణ చెప్పాలిలి
- అడవుల్లో నక్సలిజం అంతమవుతుంటే.. నగరాల్లో వర్సిటీలను అడ్డాగా చేసుకుంటున్న 'దిమాగీ నక్సల్స్'లి
- దేశ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను విద్యార్థి లోకం తిప్పికొట్టాలి: ఎన్. రాశీచందర్ రావు




హైద్రాబాద్ జులై 17;చారిత్రాత్మక జాతీయ గేయం 'వందేమాతరం' 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా దానిని సంపూర్ణంగా ఆలపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తే, కాంగ్రెస్ అగ్రనేతలు వ్యవహరించిన తీరు అత్యంత గర్హనీయమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాశీచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.జాతికి కాంగ్రెస్ బహిరంగ క్షమాపణ చెప్పాలివందేమాతర ఆలాపన జరుగుతున్న సమయంలో సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ అగ్ర నాయకులు తీవ్రఅసహనం, నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారని మండిపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోసిన పవిత్ర గేయాన్ని అవమానించడం దేశానికి వ్యతిరేకంగా చేసిన క్షమించరాని పాపమని పేర్కొన్నారు. ఈ బాధ్యతారాహిత్య వైఖరికి కాంగ్రెస్ నాయకత్వం బేషరతుగా యావత్ భారత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**• నగరాల్లో 'అర్బన్ / దిమాగీ నక్సల్స్' కుట్రలు**

గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ... దేశంలో కుహనా లౌకికవాదం, మేధావుల ముసుగులో కొందరు విద్యార్థుల్లో దేశ వ్యతిరేక భావజాలాన్ని నూరిపోస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ ఉక్కుపాదంతో అడవుల్లో నక్సలైట్లు తుపాకులు వదిలి లొంగిపోతుంటే, నగరాల్లో తిష్టవేసిన "అర్బన్ నక్సల్స్" విశ్వవిద్యాలయాల్లో 'తుక్డే తుక్డే' ముఠాలను తయారుచేస్తూ దేశ భద్రతకు ముప్పుగా మారుతున్నారని హెచ్చరించారు.

**• విద్యార్థి లోకానికి పిలుపు**

మేధావుల రూపంలో తిరుగుతూ యువత ఆలోచనలను విషతుల్యం చేస్తున్న అర్బన్ నక్సల్స్ కుట్రలను విద్యార్థులు ఎక్కడికక్కడ అప్రమత్తమై తరిమికొట్టాలని శ్రీ ఎన్. రాశీచందర్ రావు పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు యువతరం ముందుండాలని కోరారు.

# హాస్టల్ కు అనుమతిస్తే ఆందోళన తప్పదు- శ్రీ వెంకటేశ్వర కాలనీవాసుల హెచ్చరిక

- వెంకటేశ్వర కాలనీ లో హాస్టల్ కు అనుమతి ఇవ్వొద్దని ప్రజావాణిలో జీహెచ్ఎంసీ అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు
- కృపా రెడ్డి బాయ్స్ పీజీ హాస్టల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించిన కాలనీవాసులు
- జనావాసాల మధ్యలో హాస్టల్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయని కాలనీవాసుల ఆందోళన
- శంషాబాద్ జోనల్ డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన కాలనీవాసులు
- పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు



రాజేంద్రనగర్, ఆగస్టు 17..(నగరనిజం ప్రతినిధి)కాలనీ వాతావరణాన్ని దెబ్బతీస్తూ జనావాసాల మధ్యన బాయ్స్ పీజీ హాస్టల్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వరాదని శ్రీ వెంకటేశ్వర కాలనీ వాసులు ప్రజావాణిలో జీహెచ్ఎంసీ అధికారులకు మొరపెట్టుకున్నారు. తమ కాలనీలో కృపా రెడ్డి పేరుతో పీజీ బాయ్స్ హాస్టల్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారని, ఇదే జరిగితే కాలనీలో తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బాయ్స్ హాస్టల్ ఏర్పాటు ను అడ్డుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కాలనీవాసులు ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఊటుపల్లి వద్ద సెంటర్ పాయింట్ వెంచర్ లో కొందరు కృపా రెడ్డిస్ బాయ్స్ పీజీ హాస్టల్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు పలువురు సోమవారం నాడు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రజలు నివాసముండే కాలనీలో బాయ్స్ హాస్టల్ ఏర్పాటు చేస్తే ఇందిరా నగర్, సెంటర్ పాయింట్ వెంచర్,శ్రీ వెంకటేశ్వర కాలనీ, శారదానగర్, ఎస్.ఎన్.టి జన సువిధ, ఊటుపల్లి, కేఫ్ టౌన్ వెంచర్స్ ప్రాంతాల్లో నివసించే ప్రశాంత వాతావరణం దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. జనావాసాలు నివాసముండే ప్రాంతాల్లో బాయ్స్ హాస్టల్స్ ఏర్పాటు చేస్తే సమస్యలు తలెత్తుతాయని, అందువల్ల తక్షణమే తమ కాలనీలో ఏర్పాటు చేస్తున్న కృపా రెడ్డిస్ బాయ్స్ పీజీ హాస్టల్ కు అనుమతులు ఇవ్వరాదని స్థానికులు శంషాబాద్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి సందర్భంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ జోనల్ డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు కు వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కృపా రెడ్డిస్ బాయ్స్ పీజీ హాస్టల్ ఏర్పాటుకు సంబంధించి గతంలో కూడా తాము అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.కాలనీవాసుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా బాయ్స్ హాస్టల్ ఏర్పాటుకు అనుమతిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.పరిశీలించి చర్యలు తీసుకుంటాం- డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఊటుపల్లి శ్రీ వెంకటేశ్వర కాలనీ లో కృపా రెడ్డిస్ బాయ్స్ పీజీ హాస్టల్ ఏర్పాటుకు సంబంధించి గ్రామస్తులు చేసిన ఫిర్యాదుకు స్పందించిన శంషాబాద్ జోనల్ డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు... పరిశీలించి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

# ఫర్టిలైజర్ యాప్ కంటే చెప్పుల లైన్లోనైనా ఒకటి రెండు బస్తాలు దొరికేవి

- దిక్కుతోచని స్థితిలో రైతులు చదువురాని వారికి ఇబ్బందిగా మారిన ఆన్లైన్ బుకింగ్
- రైతులు ఆందోళన



మెదక్ జిల్లా (నగర నిజం నర్సాపూర్ నియోజకవర్గ ప్రతినిధి) ఆగస్టు 17మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు యాప్ లో పెట్టిన ఐదు పది నిమిషాల లోపే నో స్టాక్ అని అనిపించడంతో చదువురాని రైతులు వారికి ఏ విధంగా యూరియా తీసుకోవాలో తెలియకపోవడం. పూర్తి వివరాలకు వెళ్తే ఇతర మండలాలు రైతులు బుక్ చేసుకోవడంతో వేరే మండలాల రైతులు మన మండలం కు బుక్ చేసుకోవడంతో ఇబ్బంది మరీ తీవ్రంగా మారింది అని మేము వేరే దగ్గరికి వెళ్లి తెచ్చుకోవడం వల్ల దూరాభారం మరియు ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ప్రజావాణి కావడంతో అక్కడే ఉన్న అధికారులకు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. అగ్రికల్చర్ మండల ఆఫీసర్ కవితను రైతులు నిలదీశారు. ఇతర మండలానికి పోతే అక్కడ క్యాన్సల్ చేస్తున్నారని ఇవ్వడం లేదని రైతులు అధికారులతో వాగ్వాదం పెట్టుకున్నారు. ఎంఏఓ కవిత మాట్లాడుతూ ప్రభుత్వం ఎక్కడి నుండైనా ఏ రైతైనా బుక్ చేసుకోవచ్చని బుక్ చేసుకున్న వారికి మేము తప్పనిసరిగా ఇవ్వవలసి ఉంటుందని రైతులకు తెలిపారు. రైతులకు మాజీ సర్పంచ్ చిట్టిమిల నాగరాజు మద్దతురైతులు ఆందోళన తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ చిట్టిమీల నాగరాజు రైతుల పక్షాన ఎంఈఓ కవితను వివరణ అడిగి వారి కష్టాలను వెంటనే తీర్చాలని ఎక్కడ మండలానికి అక్కడే యూరియా సప్లై చేయాలని పై అధికారులకు వీరి కష్టాలను చెప్పాలని రైతుల డిమాండ్ చేశారు అనంతరం ప్రజావాణిలో ఫర్టిలైజర్ యాప్ పై ఫిర్యాదు చేశారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ స్థానిక నాయకులు మరియు మండల వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శిపై దాడి




వికారాబాద్।ఆగస్టు 17 (నగరనిజం జిల్లా ప్రతినిధి) వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో ఈనెల 14వ తేదీన మండల కార్యాలయంలోని ఎంపీడీవో ఛాంబర్ లో పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసినటువంటి కందనెల్లి తండా సర్పంచ్ అతని కుమారుడు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విధినిర్వానలో ఉన్నటువంటి ప్రభుత్వ ఉద్యోగులను ఇటువంటి ఇబ్బందులకు గురిచేస్తున్న వీరిపై తగిన చర్యలు తీసుకొని ఇటువంటి మరకత పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ కి అడిషనల్ కలెక్టర్ కి జిల్లా పంచాయతీ అధికారి కి రిప్రెజెంటేషన్ ఇస్తూ తమకు న్యాయం చేయకపోతే ఉద్యోగ నిర్వహణ చేయలేమని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. దాడి చేసి మరీ కౌంటర్ కంప్లైంట్ ఏంటి విధులు నిర్వహించే ఎంపీడీవో కార్యాలయంలోకి వచ్చి దాడి చేసి మళ్లీ మా మీదే కేసులు పెడితే ఇది ఎక్కడి న్యాయం అంటున్న కార్యదర్శిలు రాజకీయ ఒత్తిళ్లతో కేసులు నమోదైనట్టు చేర్చ కొనసాగుతుంది. జిల్లా స్థాయి నాయకుడు ఇన్వాల్వ్మెంట్ తోనే ఈ కేసులు పంచాయతీరాజ్ కార్యదర్శి ఇబ్బంది పెట్టే విధంగా కేసులు నమోదు చేస్తున్నారని వెల్లడి న్యాయపరమైన విచారణ జరుపకుండా కేసులు చేయడం రాజకీయ నాయకుల వర్గులతో అన్యాయంగా కేసులు నమోదు చేయడం ఏంటి అని అడుగుతున్న పంచాయితీ కార్యదర్శులు

# శంషాబాద్ లో వైభవంగా నాగుల చవితి వేడుకలు

- చారిత్రక వెండికొండ సిద్దేశ్వర ఆలయం, అమ్మపల్లి దేవాలయాలకు పోటెత్తిన భక్తులు
- పుట్ట వద్ద పాలు పోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు



రాజేంద్రనగర్, ఆగస్టు 17(నగరనిజం ప్రతినిధి)నాగుల చవితి వేడుకల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని పలు చారిత్రక దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. నాగుల చవితికి తోడు శ్రావణ సోమవారం కావడంతో శ్రీ వెండికొండ సిద్దేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం నాడు నాగుల చవితి వేడుకలను పురస్కరించుకొని శంషాబాద్ తో పాటు రంగారెడ్డి,హైదరాబాద్ జంట నగరాల నుండి భక్తులు భారీగా చారిత్రక వెండికొండ సిద్దేశ్వర ఆలయం తో పాటు అమ్మపల్లి సీతారామచంద్రస్వామి ఆలయాలకు తరలివచ్చారు. ఈ మేరకు పుట్టల వద్ద పాలు పోసి నాగదేవత ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు శ్రావణ సోమవారం కావడంతో వెండి కొండ సిద్ధేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు.... పరమశివుడికి అభిషేకాలు నిర్వహించి శివుడి సేవలో తరించారు. దీంతో భక్తుల ఓంకార నాదంతో శంషాబాద్ లోని చారిత్రక వెండికొండ సిద్దేశ్వరాలయం ప్రతిధ్వనించింది. ఒకవైపు నాగుల చవితి.... మరోవైపు శ్రావణ సోమవారం కావడంతో శంషాబాద్ లోని దేవాలయాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. దీంతో ఆలయాల వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

# కొత్తగాడి సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో( సిఓఈ ) ఎంపీసీ గ్రూప్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రత్యక్ష ప్రవేశాలు

- కళాశాల ప్రిన్సిపల్ సాయిలత



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 నగర నిజం: వికారాబాద్ జిల్లా తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల కొత్తగాడి నందు ఎంపీసీ గ్రూప్ లో మిగిలిన సీట్ల భర్తీకి అర్హత కలిగిన విద్యార్థుల నుండి ప్రత్యక్ష ప్రవేశ దరఖాస్తులు స్వీకరించడం బడతాయని కళాశాల ప్రిన్సిపల్ సాయి లత తెలియజేశారు. ఈ దరఖాస్తులను పనిదినాలో 18.8.2026 ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించబడతాయని ఆమె తెలిపారు.

**• కళాశాలకు తీసుకురావాల్సిన ధ్రువపత్రాలు**

1. ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్
2. బోనఫైడ్ సర్టిఫికెట్
3. ఎస్ఎస్సి మార్క్స్ మెమో
4. తాజా కులధ్రువపత్రం
5. తాజా ఆదాయ దృవపత్రం
6. 2 పాస్పోర్ట్ సైజ్ ఫొటోస్

అర్హత ధ్రువపత్రాల పరిశీలన మరియు అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ప్రవేశాలు కల్పించబడతాయని సాయి లత తెలిపారు. కావున ఎంపీసీ గ్రూపులో ప్రవేశం పొందవలసిన విద్యార్థినులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం తీసుకొని నిర్దేశించిన తేదీన ఉదయం అవసరమైన ధ్రువపత్రలతో సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల కొత్త గాడి నందు నేరుగా హాజరు కావాల్సిందిగా సాయిలత తెలియజేశారు.

# ఘనంగా సాయి రక్ష కన్స్ట్రక్షన్స్ సంస్థ అధినేత అన్నెపు ప్రభు ముదిరాజ్ గృహప్రవేశ వేడుక

- వేడుకలో పాల్గొని అన్నెపు ప్రభు ముదిరాజ్ కు అభినందనలు తెలిపిన సీపీఐ రాష్ట్ర నేత పానుగంటి పర్వతాలు,నర్రాగిరి





రాజేంద్రనగర్, ఆగస్టు 17(నగరనిజం ప్రతినిధి)రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కు చెందిన శ్రీ సాయి రక్ష కన్స్ట్రక్షన్స్ సంస్థ అధినేత అన్నెపు ప్రభు ముదిరాజ్ నూతన గృహప్రవేశ వేడుక వైభవంగా జరిగింది. సోమవారం నాడు నిర్వహించిన ప్రభు ముదిరాజ్ గృహప్రవేశ వేడుకకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు హాజరై ఆయనను అభినందించారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కు చెందిన శ్రీ సాయి రక్ష కన్స్ట్రక్షన్స్ సంస్థ అధినేత అన్నెపు ప్రభు ముదిరాజ్ ఊటుపల్లి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో నూతన గృహాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో పవిత్ర శ్రావణ సోమవారం కావడంతో సత్యనారాయణ స్వామి వ్రతంతో గృహప్రవేశ వేడుకను ప్రభు ముదిరాజ్ ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నేత, సీపీఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రాగిరి తో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు గృహప్రవేశ వేడుకకు హాజరై సత్యనారాయణ స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రభు ముదిరాజ్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులను వారు అభినందించారు. మరోవైపు గృహప్రవేశ వేడుకకు హాజరైన సీపీఐ నేతలు పానుగంటి పర్వతాలు, నర్రాగిరి ని అన్నెపు ప్రభు ముదిరాజ్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా గృహప్రవేశ వేడుక నిర్వహిస్తున్న అన్నెపు ప్రభు ముదిరాజ్ ను కూడా పానుగంటి పర్వతాలు, నర్రాగిరి శాలువా కప్పి అభినందించారు.

# దేవరకద్ర మండల ప్రజావాణికి 7 దరఖాస్తులు

- దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం
- దేవరకద్ర మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస రావ్



ఆగస్టు 17,(నగర నిజం ప్రతినిధి)మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 7 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో తమ ఫిర్యాదులను అధికారులకు సమర్పించారు.ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 4 దరఖాస్తులు, పంచాయతీరాజ్ శాఖకు 2 దరఖాస్తులు, మునిపల్ శాఖకు సంబంధించి 1 దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీవో వెల్లడించారు.ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు.

# టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా కు మాతృవియోగం

- శంకర్ పల్లి కి వెళ్లి సలీం పాషా మాతృమూర్తి భౌతిక కాయానికి ఘనంగా నివాళి అర్పించిన టీయూడబ్ల్యూజే నేతలు
- సలీం పాషా తో పాటు కుటుంబ సభ్యులకు జర్నలిస్టు నేతల ప్రగాఢ సంతాపం
- సలీం పాషా కుటుంబ సభ్యులను పరామర్శించిన గులాబీ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



రాజేంద్రనగర్, ఆగస్టు 17(నగరనిజం ప్రతినిధి)..టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ సలీం పాషా తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. రంగారెడ్డి జిల్లాలోని శంకర్ పల్లి లోని తన నివాసంలో సోమవారం ఉదయం హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఆమె కన్ను మూశారు. ఈ నేపథ్యంలో జర్నలిస్ట్ సలీం పాషా తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు టీయూడబ్ల్యూజే యూనియన్ కు చెందిన పలువురు రాష్ట్ర నేతలతో పాటు రంగారెడ్డి జిల్లా యూనియన్ కార్యవర్గం తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలోని శంకర్ పల్లికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ సలీం పాషా ప్రస్తుతం టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే సలీం పాషా తల్లి సోమవారం ఉదయం అనుకోకుండా తీవ్ర అస్వస్థతకు గురై తన నివాసంలో కుప్పకూలారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు ఆమెను సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించే లోగానే ఆమె తుది శ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర యూనియన్ నాయకుడు రాధా కిషన్, జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ,టీయూడబ్ల్యూ జే రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి మంచర్ల శ్రీనివాస్, జిల్లా యూనియన్ జాయింట్ సెక్రెటరీ సూర్యనారాయణ, ప్రొద్దుటూరు నరసింహా, శంకర్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి,రామచంద్రాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు టి శ్రీనివాస్ కుమార్ తో పాటు శేరిలింగంపల్లి, శంకర్ పల్లి, చేవెళ్ల ప్రాంతాలకు చెందిన పలువురు జర్నలిస్టులు సోమవారం నాడు శంకర్ పల్లి లోని సలీం పాషా నివాసానికి వెళ్లి దివంగత ఆయన మాతృమూర్తి భౌతిక కాయానికి ఘనంగా నివాళి అర్పించారు. ఈ మేరకు సలీం పాషా తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

- సలీం పాషా కుటుంబ సభ్యులను పరామర్శించిన కార్తీక్ రెడ్డి

టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సలీం పాషా తల్లి ఆకస్మిక మరణం నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ యువ నేత పట్లోళ్ల కార్తీక్ శంకర్ పల్లి కి వెళ్లి సలీం పాషా తల్లి భౌతిక కాయానికి ఘనంగా నివాళి అర్పించారు. ఈ మేరకు సలీం భాషా తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే మండల స్థాయిలో ప్రజావాణి ఎంపీడీవో రాములు

- బంట్వారం,ఆగస్టు 17(నగరనిజం జిల్లా ప్రతినిధి) మండల ప్రజలు ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- ప్రజావాణిలో మండల స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉంటారు కాబట్టి మీ సమస్యలు పరిష్కరించుకోడానికి ఇది మంచి అవకాశం.
- ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులు పరిష్కరించాడినికి మండలం యంత్రాంగం ప్రయత్నం చేస్తున్నారు.
- ఈ రోజు మొదటి ప్రజావాణిలో 4 పిర్యాదులు వచ్చాయి.
- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై రాజకీయ పార్టీలతో వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారి సమావేశం




వికారాబాద్ (ఆగస్టు 17 నగరణిజం జిల్లా ప్రతినిధి ) ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా పునఃపరిశీలన, మార్పులు, చేర్పులు మరియు తొలగింపులపై చర్చించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలోకి వచ్చేలా మార్చుకునే అవకాశం ఉందని వెల్లడించారు. అనంతరం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా ప్రతులను పార్టీల ప్రతినిధులకు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, డి.ఆర్.ఓ స్వర్ణలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ హాలి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కేజీబీవీలతో పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్య: మంత్రి వివేక్ వెంకటస్వామి.



మెదక్ బ్యూరో : నగర నిజం : మనోహరాబాద్ ఆగస్టు 17: పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.మనోహరాబాద్ మండలంలో రూ.3.25 కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవనాన్ని, చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో నిర్మించిన కేజీబీవీ భవనాన్ని సోమవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి ప్రారంభించారు.అనంతరం కేజీబీవీ విద్యార్థినులతో మంత్రి సమావేశమై పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బాలికల విద్యను బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం అనేక మౌలిక వసతులు కల్పిస్తూ కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. విద్యార్థినులకు ఇంకా ఏవైనా సౌకర్యాలు అవసరమైతే వాటిని మెరుగుపరిచేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేదల పక్షపాతిగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు.ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ విద్యాలయాల ఉపాధ్యాయుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కోరారు. కేజీబీవీల్లో అవసరమైన వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని రకాల మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జిల్లా, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ కేజీబీవీల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తికావడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అనే అంశంపై ఏపీసీలు, కోఆర్డినేటర్లు, డీఈఓ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీఓ బావయ్య, టీజీఐఐసీ అధికారులు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా పరిశ్రమల అధికారి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గౌతమి, డీఈ, ఏఈలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రైత భారతదేశాన్ని నిర్మించుకుందాం..

- వరల్డ్ మిషన్ సొసైటీ ప్రతినిధులు దుండు దినేష్ కుమార్.. ఓబుల్ రెడ్డి..
- విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్లాస్టిక్ నిర్మూలన పై అవగాహన..





మొయినాబాద్, ఆగస్టు 17(నగర నిజం):ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ రైతు దేశాన్ని నిర్మించుకుందామని ఏ ఎస్ ఈ జెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దినేష్ కుమార్ ఓబుల్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారము మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏ ఎస్ ఈ జెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి విర్థాలను సక్రమంగా ఉపయోగించుకోవాలని అవగాహన సదస్సును నిర్వహించారు ఈ కార్యక్రమం కళాశాల డీన్ డాక్టర్ .పద్మజ. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటాచలం లు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాష దేశము సాంస్కృతులకు అతీతంగా పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమన్నారు స్వయంగా శుభ్రత కార్యక్రమంలో మనందరం పాటించే ప్లాస్టిక్ను దినదినం తగ్గించుకుంటూ వస్తే పూర్తిగా నిర్మించవచ్చునని పేర్కొన్నారు అనంతరం వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ యూనివర్సిటీ విద్యార్థులు పర్యావరణ సంస్థ ఏ ఎస్ ఈ జెడ్ వాలంటీర్లు అవగాహన లో పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 175 దేశాల్లో యువతను పర్యావరణ పరిరక్షణ సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తుందని ప్రతినిధులుతెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు పునర్వినియోగ సంచులు బాటిల్లు ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలు తమ వంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో వాలంటీర్లు విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరనిజం
తెలుగు దిన పత్రిక
18 మంగళవారం,ఆగస్టు,2026

# మహిళల సౌకర్యార్థం మన చంద్ర ఫౌండేషన్ మరో మంచి కార్యం



వికారాబాద్ జిల్లా (ఆగష్టు 17 నగరణిజం జిల్లా ప్రతినిధి) బంట్వారం మండలం, తోరిమామిడి గ్రామం మార్కెట్ చౌరస్తా వద్ద మన చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళల మరుగుదొడ్డిని ఫౌండేషన్ చైర్మన్ లిడాక్టర్ ఏ. చంద్రప్రియ గారు. నేడు ప్రారంభించారు.మాజీ మంత్రివర్యులు డాక్టర్ ఏ. చంద్రశేఖర్ గారి స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు కనీస సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ టాయిలెట్ నిర్మించబడింది.ఈ సందర్భంగా చంద్రప్రియ గారు మాట్లాడుతూ... "మార్కెట్ కు, పనులకు వచ్చే మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేశాం. పరిశుభ్రతతో పాటు మహిళల గౌరవం, భద్రత కూడా చాలా ముఖ్యం. మన చంద్ర ఫౌండేషన్ ఇలాంటి సేవా కార్యక్రమాలను ముందు ముందు కూడా కొనసాగిస్తుంది. గ్రామస్తులందరూ దీనిని శుభ్రంగా ఉపయోగించుకుని కాపాడాలని కోరుతున్నాను" అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఫౌండేషన్ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ఒకే కాన్పులో రెండు ఆడ దూడలు



రాయికల్ ఆగస్ట్ 17, (నగర నిజం) జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని రాజ్‌నగర్ గ్రామానికి చెందిన బొమ్మన నరసయ్యకు చెందిన ఆవు సోమవారం వేకువజామున ఒకే కాన్పులో రెండు ఆడ దూడలకు జన్మనిచ్చింది. సాధారణంగా ఆవులు ఒకేసారి ఒక దూడకు జన్మనివ్వడం సహజం కాగా, ఒకే కాన్పులో రెండు ఆడ దూడలు పుట్టడంతో గ్రామంలో ఈ ఘటన ఆసక్తికరంగా మారింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, చుట్టుపక్కల వారు నరసయ్య ఇంటికి చేరుకుని రెండు దూడలను ఆసక్తిగా తిలకించారు. ఈ అరుదైన ఘటన గురించి గ్రామంలో పలువురు చర్చించుకున్నారు. ప్రస్తుతం తల్లి ఆవుతో పాటు రెండు ఆడ దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని యజమాని బొమ్మన నరసయ్య తెలిపారు. ఒకే కాన్పులో రెండు ఆడ దూడలు పుట్టడంతో తమకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

# బీజేపీ బలోపేతంపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చ



జగిత్యాల్ ఆగస్టు 17,(నగర నిజం) సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును జగిత్యాల జిల్లా బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితి, మండల స్థాయిలో పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యకలాపాలపై చర్చించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించినట్లు తెలిపారు.

# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్




రాయికల్ ఆగస్ట్ 17,(నగర నిజం) జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాల వయస్సు గల 19 మంది విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఆరోగ్య సిబ్బంది అందించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వ్యాక్సినేషన్ ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్త రజిత, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కౌకుంట్ల మండల ప్రజావాణికి 2 దరఖాస్తులు

- మండల తాసిల్దార్ సుందర్ రాజ్, ఎంపీడీఓ శివప్రసాద్



ఆగష్టు 17,(నగర నిజం ప్రతినిధి)మహబూబ్ నగర్ జిల్లా కౌకుంట్ల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 2 దరఖాస్తులు వచ్చినట్లు తాసిల్దార్ సుందర్ రాజు,ఎంపీడీవో శివ ప్రసాద్ తెలిపారు.వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో తమ ఫిర్యాదులను అధికారులకు సమర్పించారు.ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 1దరఖాస్తులు,పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 1 దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# చిన్న రావిరాలలో ఈనెల 23న బోనాలు

అబ్దుల్లాపూర్ మెట్, ఆగస్టు 17, (నగర నిజం) : అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని చిన్న రావిరాల గ్రామంలో ఈనెల 23వ తేదీ ఆదివారం గ్రామ దేవతల బోనాల పండుగను నిర్వహించనున్నట్లు సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సిద్ధం చేసి గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారని పేర్కొన్నారు.గ్రామ ప్రజలందరూ ఈనెల 23న జరిగే బోనాల పండుగలో కుటుంబ సమేతంగా పాల్గొని గ్రామ దేవతలను దర్శించుకుని ఆశీస్సులు పొందాలని సర్పంచ్ కోరారు. బోనాల పండుగను గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి అన్నారు కానీ చంపింది లారీ డ్రైవర్

- 36 గంటల్లోనే కేసులు చేదించిన పోలీసులు అభినందించిన జిల్లా ఎస్పీ



మెదక్ జిల్లా (నగర నిజం నర్సాపూర్ నియోజకవర్గ ప్రతినిధి) ఆగస్టు 17. మెదక్ జిల్లా చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ 15.08.2026 నాడు జరిగిన హత్య నేరం కేసులో పోలీసులు వేగవంతంగా స్పందించి కేవలం 36 గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి మృతురాలి యొక్క మొబైల్ ఫోన్ మరియు లారీ ని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరిగింది.నిందితుడి వివరాలు:రాంవీర్ సింగ్ తండ్రి విద్యా రాం, వయస్సు 45 సంవత్సరాలు, వృత్తి లారీ డ్రైవరు, =/శీ నాంగల సరిహదీ, ఇటాభ జిల్లా, ఉత్తర ప్రదేశ్

కేసు వివరాలు:ఫిర్యాదుదారుడు శ్రీ మాలోత్ వసూరం తండ్రి రాం సింగ్,(55), వ్యవసాయదారుడు, పులీగుట్ట తండా ఎ/శీ చెట్లతిమ్మాయిపల్లి గ్రామం, మాసాయిపేట్ మండలానికి చెందినవారు. తన భార్య మన్ని ప్రతిరోజు కూరగాయలను తీసుకొని మల్కాజ్గిరి కూరగాయల మార్కెట్లో అమ్మి తిరిగి రాత్రి 8 లేక 9 గంటల వరకు ఇంటికి వచ్చేది. తేదీ 14.08.2026 నాడు సుమారుగా మధ్యాహ్నము 0130 సమయంలో తన భార్య మన్ని రోజు మాదిరిగానే ఇంటి వద్ద నుండి కూరగాయల అమ్మడానికి మల్కాజ్గిరి కూరగాయల మార్కెట్ కు వెళ్ళింది, రాత్రి ఇంటికి రాలేదు. మరుసటి రోజు ఉదయం సుమారుగా 6 గంటల సమయంలో తన భార్య మన్ని మాసాయిపేట గ్రామ శివారులోని ఎన్ హెచ్ 44 రోడ్డుకు ప్రక్కన ట్రక్ లే బై దగ్గర చనిపోయి ఉన్నదని తెలియగానే అక్కడికి వెళ్లి చూడగా తన భార్యకు ఏదో ఒక గుర్తు తెలియని వాహనము ఆమె మీద నుండి వెళ్లడం వలన చనిపోయినట్లుగా ఉన్నది మరియు తన భార్య మరణము పై అనుమానం కలదని పిర్యాదు చేసినాడు , ఇట్టి పిర్యాదు మేరకు చేగుంట పోలీస్ స్టేషన్‌లో క్రైం నం.232/2026, ఖ/o 106(1) దీహీ కింద కేసు నమోదు చేయబడింది.

**దర్యాప్తు వివరాలు:**

ఫిర్యాదు అందిన వెంటనే డీఎస్పీ తూప్రాన్ శ్రీ జె. నరేందర్ గౌడ్ గారి ఆదేశాల మేరకు శ్రీ సైదా జ× రామయంపేట మరియు జి. చైతన్య రెడ్డి ఎస్. ఐ చేగుంట నేతృత్వం లో ని ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, జజుం కెమరా మరియు మృతురాలి యొక్క సెల్ ఫోన్ డాటా ఆదారంగా దర్యాప్తు చేపట్టి ఇట్టి దర్యాప్తులో మృతురాలికి మరియు నిందితుడికి మద్య గత 6 నెలలుగా సాన్నిహిత్యం ఉండి వీరిద్దరి మద్య గతంలో డబ్బుల విషయంలో గొడవలు ఉన్నాయి.నిందితుడు మృతురాలిని కలిసినప్పుడల్లా డబ్బుల విషయంలో నిందితుడిని నిలదీస్తూ ఉండేది. ఇట్టి విషయంను నిందితుడు మనుసులోపెట్టుకొని ఉద్దేశపూర్వకంగా ఆమెను ఎలాగైనా చంపాలని తేదీ 14/08/2026 రాత్రి సుమారుగా 12 గంటల సమయంలో మృతురాలికి ఫోన్ చేసి మాసాయిపేట్ గ్రామ శివారులోని ట్రక్ లే బై దగ్గరికి పిలిపించుకొని ఆమెకు మద్యం తాగించి మృతురాలిని కొట్టి కిందపడవేసి తన యొక్క లారీని ఆమె పై నుంచి ఎక్కించి చంపినాడు, ఇట్టి కేసు లో పోలీస్ వారు 36 గంటల వ్యవదిలో నిందితుడిని పట్టుకొని రిమాండ్ కు పంపడం జరిగింది .

**ప్రజలకు సూచనలు:**

ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులతో సానిహిత్యంగా ఉండటం వలన ఇటువంటి నేరాలు జరుగుతున్నాయి కాబట్టి దయచేసి ప్రతి ఒక్కరూ కూడా జాగ్రత్తగా ఉండవలసిందిగా కోరుతున్నాను.

**అభినందనలు:**

ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని డీఎస్పీ తూప్రాన్ శ్రీ జె. నరేందర్ గౌడ్ గారి పర్యవేక్షణలో, సీఐ రామాయంపేట శ్రీ బి. సైదా గారి ఆధ్వర్యంలో ఎస్ఐ చైతన్య రెడ్డి, ఎస్. ఐ భిక్యా నాయక్ , కానిస్టేబుళ్లు శ్రీనివాస్ రాథోడ్ , నరేందర్ గౌడ్, మహేశ్ , లక్ష్మీపతి , గోపాల్ ,సత్యం , సాజిద్, యాదగిరి లు సమర్థవంతంగా పని చేసి నిందితుడిని అరెస్టు చేశారు. వారి కృషిని మెదక్ జిల్లా అదనపు సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ కుమార్ ఐపీఎస్ మరియు సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ గార్లు అభినందిస్తూ తగిన రివార్డు ప్రకటించారు.

# వెండికొండ జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా బండి శ్రీకాంత్ యాదవ్

- గౌరవ అధ్యక్షుడిగా కొత్త నరసింహారెడ్డి
- 2026 జాతర బ్రహ్మోత్సవాల కోసం నూతన కమిటీని ఎన్నుకున్న సభ్యులు
- శంషాబాద్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెండికొండ జాతర బ్రహ్మోత్సవాల సన్నాహక కమిటీ సమావేశం





రాజేంద్రనగర్, ఆగస్టు 17(నగరనిజం ప్రతినిధి)..రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని చారిత్రక వెండికొండ సిద్దేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాల కమిటీ అధ్యక్షుడిగా బండి శ్రీకాంత్ యాదవ్ ఎంపికయ్యారు. మరోవైపు జాతర బ్రహ్మోత్సవాల కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా కొత్త నరసింహారెడ్డిని ఎంపిక చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని చారిత్రక శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రతి ఏటా శ్రావణమాసం చివరి వారంలో మూడు రోజులపాటు జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.ఈ జాతర బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వేలాదిగా వెండి కొండకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం నాడు శంషాబాద్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో జాతర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భేటీ అయిన ఉత్సవ కమిటీ నేతలు సభ్యులు.... ఈ ఏడాది జాతర బ్రహ్మోత్సవాల కోసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఈ ఏడాది జాతర బ్రహ్మోత్సవాల కోసం కమిటీ అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ బండి శ్రీకాంత్ యాదవ్, గౌరవ అధ్యక్షుడి కొత్త నరసింహారెడ్డిని ఎన్నుకున్నారు. అదేవిధంగా కమిటీ ఉపాధ్యక్షులుగా మాదిరెడ్డి శివారెడ్డి, కొనమొల్ల శ్రీనివాస్, గౌతా వివేకానంద గుప్త, కూచిరెడ్డి చక్రధర్ రెడ్డి, కూచిరెడ్డి శంకర్ రెడ్డి, కొత్త ధర్మేందర్ ఎంపికయ్యారు. అదేవిధంగా కమిటీ ప్రధాన కార్యదర్శిగా అరుణప్ప ఎంపిక కాగా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా దూడల వెంకటేష్ గౌడ్,చింతల రాము గుప్త, బండి గోపాల్ యాదవ్, కొలను జగ్జీవన్ రెడ్డిని ఎంపిక చేశారు. మరోవైపు కమిటీ కోశాధికారులుగా మాడుగుల పండరీనాథ్, జగదీశ్వరప్ప, కమిటీ సలహాదారులుగా మహేందర్ రెడ్డి, ఆర్.సిద్ధేశ్వర్, గణేష్ గుప్తా, టి రాజేందర్, ఈ శివారెడ్డి, ప్రకాష్ చారి, ఆంజనేయులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన బండి శ్రీకాంత్ యాదవ్ తో పాటు గౌరవ అధ్యక్షుడు కొత్త నరసింహారెడ్డిని కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

# బండ్లగూడ ఎంఆర్ఓ కు బిఆర్ఎస్ నాయకుల వినతి పత్రం



చంద్రయానగుట్ట, ఆగస్టు 17 (నగరనిజం): పేదలకు ప్రభుత్వం అందించాల్సిన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండ్లగూడ మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు.బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు చంద్రయానగుట్ట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ముప్పిడి సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆరోపించారు. అర్హులైన అనేక కుటుంబాలకు రేషన్ కార్డులు అందకపోవడంతో పాటు, పెన్షన్లు నిలిచిపోవడం, వివిధ సంక్షేమ పథకాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల విషయంలో అర్హులైన మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్ఆర్ఓ ను కోరారు.సమస్యలను పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, లలితాబాగ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేంద్ర రాజు, చంద్రయానగుట్ట అధ్యక్షుడు నరేష్ కుమార్, జంగంపేట్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ స్వరూప రాంసింగ్, బార్కాస్ డివిజన్ అధ్యక్షుడు ఇమ్రాన్, బండ్లగూడ డివిజన్ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, కంచన్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు ఫజల్ బాయ్, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, నాయకులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2026బెంగళూర్ టోర్నమెంట్‌లో..

- సత్తా చాటిన లితాండూర్ తైక్వాండో క్రీడాకారులు..
- అభినందించిన తాండూర్ తైక్వాండో మాస్టర్ మనోహార్, కుశల్, ప్రశాంత్ కుమార్..



నగర నిజం తాండూర్ ప్రతినిధి ఆగస్ట్ 17::సౌత్ జోన్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2026 బెంగళూర్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా తాండూర్ తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి సత్తా చాటారు.తాండూర్ కి చెందిన తైక్వాండో క్రీడాకారులు పూంసే, తదితర పోటీలలో అదర గొట్టారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని శివమ్ హై స్కూల్ లో తైక్వాండోక్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లను మాస్టర్ మనోహార్ అందజేశారు.కఠిన పోటీల్లో అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించి తమ ప్రాంతానికి, శిక్షణ సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఈ విజయాలను అందుకున్న క్రీడాకారులను,తల్లిదండ్రులని ఈ సందర్భంగా తైక్వాండో నిర్వాహకులు మాస్టర్ మనోహార్, కోచ్‌లు కుశల్, ప్రశాంత్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ నర్సిములు, రామలింగం నీరటి అభినందించారు.

- ఈ కార్యక్రమంలో తైక్వాండో క్రీడాకారులు

అధ్య,
అభిరామ్,
అర్షిత, మనితేజ,
మణికంత
అబ్రార్,
ఇస్మాయిల్,
సన్నిధి
ఎశ్వంత్, రేవంత్ కుమార్,
నీరటి హారిక, నీరటి హర్షిని, దక్షిత, శ్రీకౌసల్య పాల్గొన్నారు.

# తాండూర్‌లో పైలెట్ రోహిత్ రెడ్డి ఎంట్రీతో మొదలైన సందడి..!

- గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు..పైలెట్ కి
- ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ శ్రేణులు



నగర నిజం తాండూర్ ప్రతినిధి ఆగస్ట్ 17:::వికారాబాద్ జిల్లా తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తాండూర్ లో గ్రాండ్ గా ఎంట్రీ ఇవ్వడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.సోమవారం రోజు పైలెట్ రోహిత్ రెడ్డి తాండూర్‌లో అడుగుపెట్టడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో సందడి కనిపించడంతో పాటు, స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది.గతంలో తాండూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన పైలెట్ రోహిత్ రెడ్డి నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని, అనుచరవర్గాన్ని ఏర్పరచుకున్నారు.పైలెట్ రోహిత్ రెడ్డి తాండూర్‌కు ఆయన నివాసానికి రావడంతో ఆయన అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఉత్సాహంతో ఆయనను కలిసి ఘనంగా స్వాగతించారు.తాండూరు--హైదరాబాద్ మార్గంలోని ఆయా గ్రామాల వద్ద రోహిత్ రెడ్డిని చూసేందుకు అభిమానులు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఎదురుచూశారు.ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. ప్రతి ఒక్కరితో ఆత్మీయంగా ముచ్చటించారు.గులాబీ శ్రేణుల ఉత్సాహం, అభిమానుల రాకతో తాండూరులో సందడి వాతావరణం నెలకొంది.

# మంద కృష్ణ మాదిగను కలిసిన శేఖర్



నవాబ్‌పేట, । ఆగస్టు 17 । (నగర నిజం ప్రతినిధి):నవాబ్‌పేట మండలంలో ఎంఆర్‌పీఎస్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సామాజిక సమస్యలపై చర్చించేందుకు ఎంఆర్‌పీఎస్ నవాబ్‌పేట మండల అధ్యక్షుడు శేఖర్, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మండలంలో ఎంఆర్‌పీఎస్ కార్యకలాపాలు, ప్రజా సమస్యలు, సామాజిక న్యాయం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. ఎంఆర్‌పీఎస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.మంద కృష్ణ మాదిగను కలిసిన సందర్భంగా శేఖర్ పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమంతో నవాబ్‌పేట మండలంలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొందని తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శిపై దాడి.. కౌంటర్ కేసులపై ఆగ్రహం



పెద్దేముల్,। ఆగస్టు 17 । (నగర నిజం ప్రతినిధి):వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో ఈ నెల 14న మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో ఛాంబర్‌లో పంచాయతీ కార్యదర్శిపై జరిగిన దాడి ఘటనపై పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కందనెల్లి తండా సర్పంచ్, ఆయన కుమారుడు కార్యాలయంలోకి వచ్చి విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు ప్రతినిధి పత్రం సమర్పించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

- దాడి చేసి.. మళ్లీ కౌంటర్ కేసులా?

ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై దాడి జరిగిన తర్వాత, అదే ఘటనకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులపైనే కౌంటర్ ఫిర్యాదులు, కేసులు నమోదు చేయడం ఏ విధమైన న్యాయమని కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. కార్యాలయంలోకి వచ్చి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, తమపైనే కేసులు నమోదు చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

- రాజకీయ ఒత్తిళ్లపై అనుమానాలు

ఈ వ్యవహారంలో రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే కౌంటర్ కేసులు నమోదవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా స్థాయి రాజకీయ నాయకుల జోక్యంతోనే పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే విధంగా కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలను కార్యదర్శులు ప్రస్తావించారు.ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ఘటనపై సమగ్రంగా న్యాయపరమైన విచారణ జరిపి వాస్తవ

# తాండూర్ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రూ.110 కోట్లతో కాగ్నా నుంచి తాండూర్‌కు తాగునీటి పథకం
- మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్రెడ్డి
- తాండూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాతులు నాగరాజు



నగర నిజం తాండూర్ ప్రతినిధి ఆగస్టు 17 ::::కాగ్నా నుంచి తాండూర్‌కు తాగునీటి సరఫరా పథకానికి ప్రభుత్వం రూ.110 కోట్లు మంజూరు చేస్తూ 788 జారీ చేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి తెలిపారు.ఈ పథకం ద్వారా తాండూర్ మున్సిపాలిటీతో పాటు యాలాల మండలంలోని సుమారు 13 గ్రామాలకు శాశ్వత మంచినీటి సరఫరా అందనుంది.రూ.46.23 కోట్లతో సీవేజ్ ప్రాజెక్టుమురుగునీరు కాగ్నా నదిలో కలవకుండా రూ.46.23 కోట్లతో సీవేజ్ పంప్, పైప్‌లైన్, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.ఎమ్మెల్యే బీఎంర్ ప్రత్యేక కృషిమున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాగునీటి పథకానికి నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేశారని నీరజ బాల్‌రెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి. నాగరాజు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.అభివృద్ధి దిశగా తాండూర్‌ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయకత్వంలో తాండూర్ నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి వేగంగా కొనసాగుతున్నాయని వారు అన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఖాసీం, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో వెయ్యి పడకల టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం



జూబ్లీహిల్స్, । ఆగస్టు 17 ।( నగర నిజం ప్రతినిధి):ఆరోగ్య తెలంగాణకు బాటలు వేస్తూ ప్రపంచస్థాయి వైద్య సేవలకు శ్రీకారంజూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను మరింత చేరువ చేసే దిశగా మరో కీలక అడుగు పడింది. వెంగళరావు నగర్ డివిజన్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఎదురుగా నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) వెయ్యి పడకల ఆసుపత్రిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆపరేషన్ థియేటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్న వైద్య సదుపాయాలు, అత్యాధునిక చికిత్సా విధానాలను పరిశీలించారు.ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్యశాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, వైద్య విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు హాజరయ్యారు.అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకప్పుడు యూసుఫ్‌గూడ గ్రామంగా ఉన్న ప్రాంతం నేడు ఎర్రగడ్డగా అభివృద్ధి చెంది, ఇలాంటి ప్రతిష్టాత్మకమైన వైద్య సంస్థకు వేదికగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఆసుపత్రి కేవలం స్థానిక ప్రజలకు మాత్రమే కాకుండా జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన టిమ్స్ ఆసుపత్రి అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువ కానుందని నవీన్ యాద?

# డాక్టర్స్ కాలనీలో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

● అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్



ఎల్బీనగర్, ఆగస్టు 17: కొత్తపేట డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ నగర్, సాయి--వెంకటేశ్వర కాలనీ, గాంధీ బొమ్మ, చెరుకుతోట కాలనీలలో స్థానికుల ఆధ్వర్యంలో ఫలహారం బండ్లు, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. భగత్‌సింగ్ నగర్‌లో ప్రేమ్ యాదవ్, అశోక్ ఆధ్వర్యంలో, ఫంక్షన్ హాల్ వద్ద సాయి ఆధ్వర్యంలో, వెంకటేశ్వర కాలనీ రోడ్ నంబర్ 4లో రవి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గాంధీ బొమ్మ వద్ద మధు గౌడ్, శివ గౌడ్ ఆధ్వర్యంలో, చెరుకుతోట కాలనీలో బంటి, రంజిత్ ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కాలనీల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వైదేహి నగర్‌లో ఘనంగా థియా సెలూన్ ప్రారంభోత్సవం

● ముఖ్య అతిథిగా పాల్గొన్న పోరెడ్డి కవితా రెడ్డి




ఎల్బీనగర్, ఆగస్టు 17: వనస్థలిపురం వైదేహి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన థియా సెలూన్ ప్రారంభోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా "రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు పోరెడ్డి కవితా రెడ్డి" పాల్గొని నూతనంగా ప్రారంభమైన సెలూన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. థియా సెలూన్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అత్యాధునిక పరికరాలు, నిపుణుల సేవలతో హెయిర్, స్కిన్, నెయిల్ కేర్, ఏస్తటిక్స్ వంటి వివిధ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. బీఎన్ రెడ్డి నగర్, వైదేహి నగర్, వనస్థలిపురం, హస్తినాపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ఈ ఫ్రాంచైజీని ప్రారంభించిన కీర్తన, అమూల్యను పోరెడ్డి కవితా రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు ఉద్యోగాలతో పాటు వ్యాపార రంగంలోనూ రాణిస్తూ, మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాజేష్, మేఘన, లోకేష్ నూతన వ్యాపారంలో విజయవంతంగా ముందుకు సాగాలని, థియా సెలూన్ మరింత అభివృద్ధి చెంది ఇతర ప్రాంతాలకు విస్తరించాలని ఆకాంక్షించారు.

# సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులుగా ఏనుగు నరేందర్ రెడ్డి నియామకం

● తెలంగాణ సర్పంచుల ఫోరం జేపీసీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నిక
● గ్రామాల సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి అహర్నిశలు పాటుపడతా
● జిల్లాలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తా
● రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తా
● సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు, తుర్కగూడ సర్పంచ్ ఏనుగు నరేందర్ రెడ్డి





ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 (నగరనిజం) : జేపీసీ సర్పంచుల ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఇబ్రహీంపట్నం మండలం తుర్కగుడ గ్రామ సర్పంచ్ ఏనుగు నరేందర్ రెడ్డి సోమవారం ఎన్నికయ్యారు. తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, సుర్వీ యాదయ్య గౌడ్ వ్యవస్థాపక అధ్యక్షులు, (జేపీసీ) వారి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఏనుగు నరేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో మరియు మండల సమగ్ర అభివృద్ధి గ్రామాల పురోభివృద్ధి, ప్రజల సంక్షేమం మంచి పరిపాలన సాధ్యమయ్యే విధంగా సమిష్టి కృషిని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఫోరం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ సర్పంచుల సంఘం జేపీసీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి వర్యులు శ్రీనివాస్ గౌడ్, తదితర చేతుల మీదుగా ఏనుగు నరేందర్ రెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏనుగు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... నాపై నమ్మకంతో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందున బాధ్యత మరింత పెరిగిందని, అందరి సహకారంతో జిల్లా మండల పరిధిలోని గ్రామాలు అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా సర్పంచులకు గౌరవ వేతనం కూడా పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడతానన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తానని అన్నారు. సర్పంచులకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తానని చెప్పారు. నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, చిత్తశుద్ధితో నిస్వార్థంగా పనిచేస్తానని తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, సర్పంచుల సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థల బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు తమ వంతుగా తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. నాపై మరింత బాధ్యత పెరిగిందని, అదే బాధ్యతతో గ్రామాల అభివృద్ధి, సంక్షేమానికి, పెద్దపీట వేస్తానని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచుల సమిష్టి కృషి చాల అవసరం అన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అన్ని గ్రామాల సర్పంచులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికకు సహకరించిన బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులకు, రాష్ట్ర సర్పంచుల ఫోరం కమిటీ పెద్దలకు, ఆయన ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఏనుగు నరేందర్ రెడ్డి నియామకం పట్ల గ్రామ ప్రజలు, పలువురు నేతలు, హర్షం వ్యక్తం చేశారు.

# ప్లాస్టిక్ రైత భారతదేశాన్ని నిర్మించుకుందాం..

**వరల్డ్ మిషన్ సొసైటీ ప్రతినిధులు దుండు దినేష్ కుమార్.. ఓబుల్ రెడ్డి..**

**విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్లాస్టిక్ నిర్మూలన పై అవగాహన..**





మొయినాబాద్.. ఆగస్టు 17 (నగర నిజం) ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ రైతు దేశాన్ని నిర్మించుకుందామని ఏ ఎస్ ఈ జెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దినేష్ కుమార్ ఓబుల్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారము మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏ ఎస్ ఈ జెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి విర్ధాలను సక్రమంగా ఉపయోగించుకోవాలని అవగాహన సదస్సును నిర్వహించారు ఈ కార్యక్రమం కళాశాల డీన్ డాక్టర్ .పద్మజ. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటాచలం లు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాష దేశము సాంస్కృతులకు అతీతంగా పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమన్నారు స్వయంగా శుభ్రత కార్యక్రమంలో మనందరం పాటించే ప్లాస్టిక్ను దినదినం తగ్గించుకుంటూ వస్తే పూర్తిగా నిర్మించవచ్చునని పేర్కొన్నారు అనంతరం వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ యూనివర్సిటీ విద్యార్థులు పర్యావరణ సంస్థ ఏ ఎస్ ఈ జెడ్ వాలంటీర్లు అవగాహన లో పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 175 దేశాల్లో యువతను పర్యావరణ పరిరక్షణ సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తుందని ప్రతినిధులుతెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు పునర్వినియోగ సంచులు బాటిల్లు ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజలు తమ వంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో వాలంటీర్లు విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలి

**పేదల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ మొయినాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ధర్నా**





మొయినాబాద్ మున్సిపాలిటీ ఆగస్టు 17 (నగర నిజం) బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మహేశ్వరం నియోజకవర్గ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు, కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మొయినాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంత రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ గారి హయాంలో పేదింటి ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఆ హామీని నెరవేర్చకపోగా.. ఇప్పుడు పేదల కోసం అమలవుతున్న పథకాన్ని కూడా ఆపే పరిస్థితి తీసుకురావడం దుర్మార్గమని అన్నారు.ఈ పథకానికి సంబంధించి హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్నప్పటికీ, ప్రభుత్వం సరైన సమయంలో కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నించేలా ఉందన్నారు. కోర్టులో బలమైన వాదనలు వినిపించి పథకాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చిందని, అందులో కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకం ఎంతో ప్రతిష్టాత్మకమైనదని లికొంపల్లి అనంత రెడ్డి అన్నారు. పేదల ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచే ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసి, కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదల పక్షాన బీఆర్ఎస్ పార్టీ మరింత ఉధృతంగా ఉద్యమిస్తుందని హెచ్చరించారు.తులం బంగారం హామీ ఏమైంది ఉన్న కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్‌ను ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారు పేదల సంక్షేమంతో చెలగాటం ఆడితే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరు" అని మొయినాబాద్ మండల అధ్యక్షులు దారెడ్డి వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ శ్రేణులందరికీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.పేదల సంక్షేమ పథకాలను కాపాడే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు.కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్‌ను కొనసాగించాల్సిందే.. పేదల ఆడబిడ్డలకు న్యాయం చేయాల్సిందే..

# వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన బస్సులు



హయత్ నగర్, ఆగస్టు 17, (నగర నిజం) : చాలా రోజుల తర్వాత శుభ ముహూర్తాలు ప్రారంభం కావడంతో శ్రావణమాసంలో వివాహాది శుభకార్యాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో అద్దె ప్రాతిపదికన బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు హయత్ నగర్-1 డిపో మేనేజర్ లావణ్య తెలిపారు.వివాహాలు, ఇతర శుభకార్యాలకు అవసరమైన వారికి వారు కోరిన ప్రాంతానికి బస్సులను పంపించే సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల విహార యాత్రలకు కూడా అద్దె ప్రాతిపదికన బస్సులను అందిస్తున్నట్లు తెలిపారు.బస్సులు అవసరమైన వారు 9959226138, 9553278191 నంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజర్ లావణ్య కోరారు.

నగరనిజం



# ఐస్ మేక్ రిఫ్రిజరేషన్ ఆదాయం 60 శాతం వృద్ధి






(ఎడమ నుండి కుడికి): శ్రీ చంద్రకాంత్ పి. పటేల్, చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ , ఎం. శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఐస్ మేక్ రిఫ్రిజరేషన్ లిమిటెడ్.

హైదరాబాద్, ఆగస్టు 17, (నగర నిజం) : ఐస్ మేక్ రిఫ్రిజరేషన్ లిమిటెడ్ ఆర్థిక సంవత్సరం 2026-27 తొలి త్రైమాసికంలో బలమైన ఆదాయ వృద్ధిని నమోదు చేసింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ సమీకృత నిర్వహణ ఆదాయం 60.4 శాతం పెరిగి రూ.178.88 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.111.50 కోట్లుగా నమోదైంది. ఆర్థిక సంవత్సరం 2025-26లో కంపెనీ రూ.668.20 కోట్ల రికార్డు వార్షిక ఆదాయాన్ని నమోదు చేసిన నేపథ్యంలో తాజా వృద్ధి కొనసాగింది.కమర్షియల్ రిఫ్రిజరేషన్, కోల్డ్ చైన్ తదితర రంగాల్లో డిమాండ్ బలంగా ఉన్నప్పటికీ, లాభదాయకతపై ఒత్తిడి కొనసాగింది. తొలి త్రైమాసికంలో పన్నుకు ముందు నష్టం రూ.2.23 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో రూ.1.84 కోట్ల నష్టం వచ్చింది. పన్ను అనంతర నష్టం రూ.1.65 కోట్లుగా ఉండగా, గత ఏడాది రూ.1.47 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక ఈబీఐటీడీఏ సుమారు రూ.3.09 కోట్లుగా ఉండగా, గత ఏడాది ఇదే కాలంలో రూ.4.53 కోట్లుగా ఉంది. ఈబీఐటీడీఏ మార్జిన్ 1.7 శాతానికి తగ్గింది.కంపెనీ కోల్డ్ రూమ్స్, ఫ్రీజర్లు, రిఫ్రిజరేషన్ వ్యవస్థలు, చిల్లింగ్ ప్లాంట్లు తదితర ఉత్పత్తులను తయారు చేసి సరఫరా చేస్తోంది. చెస్ట్ ఫ్రీజర్లు, నిరంతర ప్యానెళ్ల వంటి కొత్త వ్యాపార విభాగాలకు త్రైమాసికంలో మంచి మార్కెట్ ఆదరణ లభించిందని కంపెనీ తెలిపింది.లాభదాయకతను మెరుగుపరచడంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. సామర్థ్య వినియోగాన్ని పెంచడం, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన ఉత్పత్తుల మిశ్రమం, ఖర్చుల నియంత్రణ ద్వారా మార్జిన్లను పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల చేసిన పెట్టుబడుల నుంచి ప్రయోజనాలు అందడంతో సామర్థ్య వినియోగం పెరిగి, భవిష్యత్తులో నిర్వహణ స్థాయి ప్రయోజనాలు మెరుగుపడతాయని కంపెనీ అంచనా వేస్తోంది.జపాన్‌కు చెందిన గలిలీ హోల్డింగ్స్‌తో ప్రతిపాదిత వ్యూహాత్మక భాగస్వామ్యం కంపెనీ వృద్ధి ప్రణాళికలో కీలకంగా మారనుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా గలిలీ హోల్డింగ్స్ ఐస్ మేక్‌లో రూ.180 కోట్ల పెట్టుబడి చేయనుంది. ఈ పెట్టుబడి ప్రాధాన్యతా వాటాల జారీ ద్వారా చేపట్టనున్నారు. అదనంగా ఇతర పెట్టుబడిదారుల నుంచి రూ.10 కోట్లు సమీకరించాలని కంపెనీ నిర్ణయించింది.ఇరు సంస్థలు 60:40 నిష్పత్తిలో సంయుక్త సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాయి. ఇందులో గలిలీ హోల్డింగ్స్‌కు 60 శాతం, ఐస్ మేక్‌కు 40 శాతం వాటా ఉంటుంది. వాణిజ్య నిలువు రిఫ్రిజిరేటర్లు, వాణిజ్య టేబుల్ రిఫ్రిజిరేటర్లు, ఇతర సంబంధిత శీతలీకరణ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, పంపిణీపై సంయుక్త సంస్థ దృష్టి సారించనుంది.సమీకరించనున్న నిధులను తయారీ సామర్థ్యాల విస్తరణ, ఆధునీకరణ, సంయుక్త సంస్థలో పెట్టుబడి, కార్పొరేట్ కార్యాలయం, నైపుణ్య కేంద్రం, అభివృద్ధి-పరీక్ష ప్రయోగశాల పూర్తి చేయడం, రుణాల చెల్లింపు, ఎంపిక చేసిన ఇతర వృద్ధి అవకాశాలకు వినియోగించనున్నట్లు కంపెనీ వెల్లడించింది.ఐస్ మేక్ రిఫ్రిజరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ పి. పటేల్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం 2026-27ను బలమైన ఆదాయ వృద్ధితో ప్రారంభించామని తెలిపారు. తయారీ సామర్థ్యాలు, ఉత్పత్తులు, డిజిటలైజేషన్, సిబ్బంది అభివృద్ధిలో చేసిన పెట్టుబడులు భవిష్యత్తులో మెరుగైన నిర్వహణ సామర్థ్యంగా మారేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సామర్థ్య వినియోగాన్ని పెంచడం, క్రమశిక్షణతో కూడిన మూలధన వినియోగంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.కంపెనీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తొలి త్రైమాసిక ఆదాయ వృద్ధి రిఫ్రిజరేషన్ ఉత్పత్తులు, పరిష్కారాలకు ఉన్న బలమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తోందన్నారు. అయితే భౌగోళిక-రాజకీయ పరిస్థితుల కారణంగా సరుకులు, ముడి పదార్థాల ధరలు అధిక స్థాయిలో కొనసాగడం త్రైమాసిక లాభదాయకతపై ప్రభావం చూపిందని వివరించారు. మార్కెట్ విస్తరణ, బలమైన అమలు, నిర్వహణ సామర్థ్యంపై దృష్టి కొనసాగిస్తామని తెలిపారు.కమర్షియల్ రిఫ్రిజరేషన్, కోల్డ్ చైన్, ఆహార ప్రాసెసింగ్, ఆతిథ్య, ఔషధ, రిటైల్, పారిశ్రామిక రంగాల్లో తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని ఐస్ మేక్ లక్ష్యంగా పెట్టుకుంది. గలిలీ భాగస్వామ్యం, కొత్తగా సమీకరించే మూలధనాన్ని ప్రణాళికాబద్ధంగా వినియోగించడం ద్వారా తయారీ సామర్థ్యాలు, ఉత్పత్తుల పరిధిని బలోపేతం చేయాలని కంపెనీ భావిస్తోంది. రాబోయే త్రైమాసికాల్లో విస్తరణ ప్రణాళికల అమలు, సామర్థ్య వినియోగం, నిర్వహణ మార్జిన్ల మెరుగుదల కీలకంగా మారనున్నాయి.

# నూతన్‌కల్‌లో నాగులమ్మకు నీడగా.. వందల ఏళ్ల మహావృక్షం!

### పక్కనే భైరవుని కుంట.. కొలనులో పురాతన భైరవుని విగ్రహం ఉందంటున్న గ్రామస్తులు

మేడ్చల్ ఆగస్టు 17(నగరనిజం): తరాలు మారుతున్నా.. రూపురేఖలు మారుతున్నా.. గ్రామ చరిత్రకు కొన్ని ఆనవాళ్లు మాత్రం నేటికీ సజీవ సాక్ష్యాలుగా నిలుస్తుంటాయి.ఎల్లంపేట్ మున్సిపల్ నూతన్‌కల్‌లోని నాగులమ్మ తల్లి విగ్రహం, దాని చుట్టూ విస్తరించిన మహా మర్రివృక్షం, పక్కనే ఉన్న భైరవుని కుంట, ఆ కుంటలోనే పురాతన భైరవుని విగ్రహం ఉందని గ్రామస్తులు చెబుతున్న విషయం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

### నాగులమ్మకు నీడగా మహావృక్షం

నాగులమ్మ తల్లి విగ్రహం ఉన్న ప్రదేశంలో ఉన్న మర్రిచెట్టు సాధారణ వృక్షాలకు భిన్నంగా విశాలంగా విస్తరించి ఉంది. భారీ కొమ్మలు, నేలను తాకి తిరిగి కాండాలుగా మారిన అనేక ఊడలు, మందమైన కాండాలతో ఈ వృక్షం ఒక చిన్న వనంలా కనిపిస్తోంది. చెట్టు విస్తరించిన తీరు చూస్తే దాని మొత్తం పరిమాణాన్ని ఒకే కొలతతో అంచనా వేయడం కష్టంగా ఉంది.

### "మా చిన్నప్పటి నుంచే ఇంత పెద్దగా ఉంది"

ఈ మహావృక్షం వయస్సుపై గ్రామ పెద్దల్లో ఆసక్తికరమైన మాటలు వినిపిస్తున్నాయి. కొంతమంది పెద్దలు ఈ వృక్షం సుమారు 200 సంవత్సరాలకు పైబడినదై ఉండవచ్చని చెబుతున్నారు. మరోవైపు 80--90 ఏళ్ల వయస్సున్న గ్రామ పెద్దలు కూడా తాము చిన్ననాటి నుంచి చూస్తున్నప్పటి నుంచే ఈ చెట్టు మహావృక్షంగానే ఉందని చెబుతున్నారు.
అయితే వృక్షం ఖచ్చితమైన వయస్సును నిర్ధారించే శాస్త్రీయ ఆధారాలు ప్రస్తుతం లేవు. అందువల్ల 200 ఏళ్లకు పైబడినదనే విషయం స్థానికుల మౌఖిక చరిత్ర, నమ్మకాల ఆధారంగానే ఉంది.

### నాగుల చవితి సందర్భంగా ఘనంగా పూజలు

మహావృక్షం కింద నాగులమ్మ తల్లి విగ్రహం ఉంది. సాధారణ రోజుల్లో ఇక్కడ పెద్దగా పూజా కార్యక్రమాలు జరగవు. అయితే నాగుల చవితి సందర్భంగా మాత్రం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ రోజు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాగులమ్మను దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు.




వందల సంవత్సరాలు చరిత్ర కలిగినటువంటి నాగులమ్మ విగ్రహం

### పక్కనే భైరవుని కుంట

నాగులమ్మ మహావృక్షానికి సమీపంలోనే భైరవుని కుంట లేదా భైరవుని కొలను ఉంది. ఈ కుంటకు కూడా పురాతన నేపథ్యం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. మరింత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ కొలనులోనే మరో పురాతన భైరవుని విగ్రహం ఉందని స్థానికులు చెబుతుండటం.
ఆ విగ్రహం ఎప్పటిది? ఎవరు ప్రతిష్ఠించారు? అది మొదటి నుంచే అక్కడ ఉందా? అనే విషయాలపై స్పష్టమైన చారిత్రక ఆధారాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. అయితే పాత తరాల నుంచి ఈ విగ్రహం గురించి వింటూ వస్తున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

### ఒకే ప్రాంతంలో.. ఎన్నో ప్రశ్నలు

నాగులమ్మ విగ్రహం.. దానికి ఆశ్రయంగా నిలిచిన మహా మర్రివృక్షం.. పక్కనే భైరవుని కుంట.. కొలనులో ఉందని చెబుతున్న పురాతన భైరవుని విగ్రహం.. ఇవన్నీ ఒకే ప్రాంతంలో ఉండటం ఆసక్తిని కలిగిస్తోంది.

ఈ ప్రాంతానికి గతంలో ఏదైనా ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉండేదా? నాగులమ్మ, భైరవుని విగ్రహాలకు పరస్పర సంబంధం ఉందా? భైరవుని కుంటకు ఆ పేరు ఎలా వచ్చింది? వంటి ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది.



నాగులమ్మకు నీడగా ఉన్న మహావృక్షం దృశ్యం

### వెలుగులోకి రావాల్సిన చరిత్ర

గ్రామ పెద్దల జ్ఞాపకాలు, తరతరాలుగా వస్తున్న స్థానిక కథనాలతో పాటు పురాతన రికార్డులు, శాసనాలు, భౌగోళిక ఆధారాలను పరిశీలిస్తే ఈ ప్రాంత చరిత్రపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే వృక్ష నిపుణులతో మహావృక్షాన్ని పరిశీలించి దాని వయస్సుపై శాస్త్రీయ అంచనా వేయడం, భైరవుని విగ్రహాన్ని నిపుణులు పరిశీలించడం అవసరమని స్థానికులు భావిస్తున్నారు.

## మౌనంగా నిలిచిన మహావృక్షం.. చరిత్రను వెతుకుతున్న తరాలు

**నాగులమ్మ ఎవరి జ్ఞాపకం? భైరవుని కుంట ఎవరి ఆనవాలు?**

వందల ఏళ్ల నాటిదని గ్రామ పెద్దలు చెబుతున్న మహా మర్రివృక్షం.. దాని నీడలో నాగులమ్మ విగ్రహం.. పక్కనే భైరవుని కుంట.. కొలనులో పురాతన భైరవుని విగ్రహం ఉందని స్థానికుల చెబుతున్న మాటలు.. ఇవన్నీ యాదృచ్ఛికమా? లేక నూతన్‌కల్ గతంలో మరుగునపడిన ఏదైనా ఆధ్యాత్మిక చరిత్రకు ఇవే ఆనవాళ్లా? సమాధానం చెప్పాల్సింది కాలమే.. కానీ ఆ చరిత్రను వెలికితీయాల్సిన బాధ్యత మాత్రం నేటి తరానిదే!

**"చెట్టు వయస్సు ఎంత?" కంటే.. "ఇన్ని తరాలుగా ఇది ఎందుకు ఇక్కడే ఉంది?" అనేదే అసలు ప్రశ్న!**



భైరవని కుంటలో ఉన్న భైరవని విగ్రహం



నాగుల పంచమి సందర్భంగా అమ్మవారికి భక్తులు పూజలు చేస్తున్న దృశ్యం

### తరాలు మారినా.. సాక్షిగా మహావృక్షం

నాగులమ్మ తల్లి విగ్రహానికి నీడనిస్తూ విస్తరించిన మహా మర్రివృక్షం, పక్కనే నిశ్శబ్దంగా ఉన్న భైరవుని కుంట, అందులో ఉందని చెబుతున్న పురాతన భైరవుని విగ్రహం.. ఇవన్నీ నూతన్‌కల్ గ్రామ గతానికి మౌన సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

కాలం ఎంత మారినా.. తరాలు ఎన్ని మారినా.. నాగులమ్మకు నీడగా నిలిచిన ఈ మహావృక్షం మాత్రం తన ఊడలను నేలలోకి దించి మరింత విస్తరిస్తూ, నూతన్‌కల్ చరిత్రను తనలో దాచుకున్న జీవంతమైన గుర్తుగా నిలుస్తోంది.

